నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | మే 27, 2024 | www.navatelangana.com

అటవీ భూమి కోసం కొట్లాట



- ఘర్షణ పడ్డ ఇరు గ్రామాల ప్రజలు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని సోమారం తండా, కొత్తబాది గ్రామాల మధ్య అటవీ భూమి కోసం ఆదివారం రెండు గ్రామాల ప్రజల మధ్య గొడవ జరిగింది. కొత్తబాది గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ట్రాక్టర్లతో వచ్చి ఫారెస్ట్ భూమిని అక్రమించుకొని దున్నారు. ఇది గమనించిన సోమారం తండా వాసులు.. సదరు భూమిని తమకు ప్రభుత్వం ఇచ్చిందని ఇక్కడ ఎందుకు దున్నుతున్నారని ప్రశ్నించడంతో రెండు గ్రామాల వాసుల మధ్య ఘర్షణ జరిగిందని స్థానికులు తెలిపారు. కాగా పలువురికి గాయాలైనట్టు సమాచారం. వారిని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇరు గ్రూపుల వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

పురుగుల అన్నం, కుళ్లిన కోడిగుడ్లు





జిజిహెచ్‌లో రోగులకు పంపిణీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యం కోసం జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర ప్రాంతాల వారు వైద్యం చేయించుకునేందుకు వస్తుంటారు. అనారోగ్యానికి గురై ఆరోగ్యంగా వెళ్తుంటారు. అయితే ఆరోగ్య శ్రీ కింద రోగులకు అందజేస్తున్న భోజనంలో పురుగుల అన్నం, కుళ్లిన కోడిగుడ్లు వస్తున్నట్టు పలువురు రోగులు ఆరోపిస్తున్నారు. చికిత్స పొందుతున్న రోగులకు పౌష్టికాహారం అందించాల్సి ఉన్నా.. అందుకు విరుద్ధంగా అందజేస్తున్నారని రోగుల బంధువులు వాపోతున్నారు. పురుగుల అన్నం, కుళ్లిపోయిన కోడిగుడ్లు వస్తున్నాయని వాటిని ఫోటోలు దించగా.. అవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇప్పటికైనా ఇటువంటి పరిస్థితులు రాకుండా జిజిహెచ్ యంత్రాంగం సరైన చర్యలు తీసుకొని, చికిత్స పొందుతున్న వారికి సరైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సోషల్ మీడియాలో పలువురు కోరుతున్నారు.

కౌలురైతులకేది 'భరోసా'..?

- ఎదురుచూస్తున్న కౌలు రైతులు
- ఖరీఫ్ సీజన్ నుంచే అమలు చేయాలంటూ విన్నపాలు
- ఎకరాకు రూ.15 వేలు అందజేస్తామని మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటన
- తెరపైకి అఫిడవిట్.. యజమానులు ఇచ్చేనా..?
- జిల్లాలో 30 వేల పైగా కౌలు రైతులు

నవతెలంగాణ-లింగంపేట్

కాంగ్రెస్ ప్రభుత్వం.. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆరు గ్యారెంటీ పథకాల్లో రైతు భరోసా పథకం ప్రకటించింది. భూములున్న రైతులతో పాటు కౌలు రైతులకు సైతం భరోసా పథకం కింద ప్రతి ఏటా ఎకరానికి రూ.15000 చెల్లిస్తామని ప్రకటించింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి రాష్ట్రంలో అధికారం చేపట్టింది. కాగా రైతు భరోసా ప్రకటనపై కౌలు రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. సాగు చేసుకునేందుకు భూమి లేక.. భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తుండగా.. ప్రకృతి ప్రకోపాలు, చీడపీడల బెడద తదితర వాటివల్ల నష్టాలను చవిచూస్తున్నారు. దీనికి తోడు కౌలు ధరలు సైతం పెరగడంతో సాగు గిట్టుబాటు కాక అప్పుల పాలవుతున్నారు. రైతుభరోసా కింద తమకు పెట్టుబడి సాయం అందింతే తమకు తోడ్పాటు అవుతుందని కౌలు రైతులు భావిస్తున్నారు. అయితే తాజాగా తెరపైకి అఫిడవిట్ వచ్చింది. సాగు చేస్తున్న రైతులు సదరు భూ యజమానుల నుంచి అఫిడవిట్ తీసుకుంటేనే కౌలు రైతులకు వర్తించనున్నట్టు సమాచారం. అయితే సదరు యజమానులు అఫిడవిట్ అందించేందుకు అంగీకరించేనా..?

ఆరు గ్యారెంటీల పథకానికి ఇటీవల వెల్లువలా దరఖాస్తులు వచ్చాయి. కాగా రైతు భరోసా కింద కౌలు రైతులు సుమారు 30 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. కాగా అనధికారికంగా ఆ సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. సొంత భూములు లేక కౌలు పన ఆధారపడి వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులను గత ప్రభుత్వం గుర్తించలేదు. కౌలు రైతులు పండించిన పంటను అధికారికంగా అమ్మ లేక నానా ఇబ్బందులు పడ్డారు. కష్టపడి పని చేసే కౌలు రైతులకు గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. రాత్రనక పగలనకా కష్టపడి పని చేసిన కౌల రైతులకు పంటలు సాగు చేసేందుకు ప్రైవేటు అప్పులు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకుంటామని భరోసా ఇవ్వడంతో కౌలు రైతుల్లో కొత్త ఆశలు మొదలయ్యాయి.



జిల్లాలో 30 వేల పగానే కౌలు రైతులు

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులు 30 వేల పేద మంది ఉన్నట్లు అధికారులు గతంలో ఉన్న వివరాల ఆధారంగా వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 3 లక్షల 89 వేల మందికిపైగా సన్న చిన్న కారు కౌలు రైతులు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు ఇతర రంగాలకు చెందిన వారు వ్యవసాయం చేసే ఆసక్తి లేకపోవడంతో సాగు కష్టాలను ఎదుర్కొనే పరిస్థితి లేక తమ భూములను వృథాగా ఉండకుండా కౌలుకిస్తున్నారు. ఎకరాకు డబ్బులు ఇస్తామని రైతుతో ముందస్తుగా కౌలు రైతులు ఒప్పందం కుదిరించుకుంటున్నారు. కొంతమంది పట్టాదారు రైతులు పైసలకు బదులుగా ఎకరాకు ఆరు కింటాల ధాన్యం తీసుకుంటున్నారు. ఒప్పందం కుదిరించుకుంటున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సాయం పట్టాదార్ ఖాతాలోని జమవుతుంది. పంట సాగు చేసిన కౌలు రైతు ఎక్కడ పేరు లేకుండా పోయింది. పంటలు సాగు చేసి ఎరువులు విత్తనాలు సబ్సిడీకి అందకుండా పోతుంది. వరి కోతలు కోసే వరకు కౌలు రైతులు అప్పులు చేయాల్సి వస్తుంది. బ్యాంకుల వద్దకు వెళ్తే పాస్‌బుక్కులు లేక రుణాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు వివరాలను సేకరించింది. తెలంగాణ ప్రభుత్వం కౌలు రైతుల వివరాలు తీసుకొని ధరణి పోర్టల్ లో నమోదు చేసి వివరాలు బయటకు రాకుండా గోప్యంగా ఉంచారు. పట్టాదారు పేరు మినహా ఇతర కాలం లేకపోవడంతో కౌలు రైతుల గుర్తింపు శాశ్వతంగా అడ్డుపడింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు అన్ని విధాల ఆదుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంతో కొత్త ఆశలు మొదలయ్యాయి.

పెరుగుతున్న పెట్టుబడులు..
భరోసా కోసం ఎదురుచూపులు

రోజు రోజుకు పంటలు పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. దీంతో కౌలు రైతులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఒక ఎకరం వరి పంట సాగు వేయాలంటే 25 నుంచి 30 వేల వరకు ఖర్చు అవుతుంది. అంతేకాకుండా పట్టాదారు యజమానికి ముందస్తు కుదిరించిన ఒప్పంద ప్రకారం పంట పూర్తయిన వెంటనే డబ్బులు ఇవ్వాల్సి వస్తుంది. ఎకరాకు 10 వేలు ప్రతి పంటకు ఇవ్వాల్సి ఉంది. కొంతమంది ఎకరాకు ఆరుకింటల్లా ధాన్యం ఇస్తామని ఒప్పందం కుదిరించుకుంటున్నారు. కుటుంబ సభ్యులు కష్టపడి పని చేస్తేనే కొంతమేరకు మిగులుతుంది. పెట్టుబడి, ఖర్చులతో పాటు కౌలు డబ్బులు చెల్లించే వరకు చివరకు కౌలు రైతులకు ఏమీ మిగలడం లేని పరిస్థితి నెలకొంది. పకృతి ప్రకోపం చూపిస్తే ఆ యేడే అప్పుల పాలే. మరోవైపు ధరలు పెరగడంతో పెట్రోల్ డీజిల్ ట్రాక్టర్ కేజీవిల్ దున్నకాలు ధరలు కూలీల రేట్లు వరి కోత మిషన్ ఎరువులు విత్తనాల ధరలు పెరగడంతో కౌలు రైతులకు మిగిలే పరిస్థితి లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో కౌలు రైతులకు సైతం రైతుభరోసా ప్రకటించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. అయితే దీనికి సంబంధించి ఇప్పటి వరకు విధివిధానాలు ఖరారు కాకపోగా.. ప్రభుత్వం నుంచి సైతం ఎలాంటి ప్రకటనా రాకపోవడంతో కౌలు రైతులు ఉసూరుమంటున్నారు.

కౌలు గుర్తింపుకార్డులిస్తే మేలు



ఆరుగాలం కష్టపడి పనిచేసిన కౌలు రైతులకు పంటలు అమ్ముకోవడానికి అడుగడుగునా తిప్పలు ఎదురవుతున్నాయి. ప్రతి ఏటా ఖరీఫ్ యాసంగిలో కౌలు రైతులు ధాన్యం పండించడం పంటలు సాగు చేయడం ఒక ఎత్తు అయితే కొనుగోలు కేంద్రాలకు తరలించి ధాన్యాన్ని అమ్ముకోవడం మరో ఎత్తు అవుతుంది. ప్రతి సంవత్సరం వ్యవసాయ శాఖ అధికారులు రైతులు పంటలు సాగు చేసుకునే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే నిర్వహిస్తారు అధికారులు పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న రైతులకు పేర్లను సర్వేలో నమోదు చేస్తున్నారు. కౌలు రైతులు పట్టాదారు యజమాని దగ్గరికి వెళ్లి తమ పేరు మీద దాన్యం తూకం నమోదు చేసుకోవాలని పట్టాదారు పాస్ పుస్తకం ఇవ్వాలని కోరినా పలువురు ఇచ్చేందుకు సిద్ధపడటం లేదు. దీంతో చేసేదేమీ లేక ఇతర రైతుల పేర్ల మీద ధాన్యం తూకం వేస్తున్నారు. తిరిగి డబ్బులు ఖాతాలో జమైన తర్వాత డబ్బులు తీసుకుంటున్నారు. పంట నష్టం జరిగిన నష్టపరిహారం వచ్చిన పట్టాదారుకి వర్తిస్తుంది కానీ కౌలు రైతులకు అందడం లేదు. కౌలు రైతుకు మాత్రం ఏ మాత్రం ఏది వర్తించడం లేదు. చివరికి పండించిన పంట పట్టాదారు లేదా ఇతరుల పేర్ల మీద తూకం వేసుకోవాల్సిన దుస్థితి వస్తుందని కౌలు రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని వారు కోరుతున్నారు. ఆ కార్డుల ద్వారా బ్యాంకుల నుంచి రుణసదుపాయం కల్పించాలని, ఎరువులు, విత్తనాలు సబ్సిడీ మీద అందించాలని కోరుతున్నారు. దీంతో పాటు పంటల విక్రయించుకునే సదుపాయం కల్పించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఖరీఫ్ నుంచే రైతుభరోసా సాయం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పుడే అప్పుల ఊబిలో నుంచి బయటపడతామని పేర్కొంటున్నారు.

ఏమీ మిగలడం లేదు

సేవియా నాయక్. బంజారా తండా

ప్రతి సంవత్సరం 5 ఎకరాలు కౌలుకు తీసుకొని చేస్తున్నా పైసలు మిగలడం లేదు. సాగు ధరలు పెరుగుతున్నాయి. అందరం కలిసి పనిచేస్తే కూలి కూడా పడుతలేదు. పెట్టుబడి సాయం రాక అప్పులు చేస్తున్నాం. సర్కారు రైతు భరోసా వచ్చి ఆదుకోవాలి.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

కాశీరాం. లింగంపేట్

ప్రతి ఏటా ఖరీఫ్ యాసంగిలో వడ్లు కాంటపెట్టేందుకు తిప్పలవుతుంది. సర్కారు కౌలురైతులకు గుర్తింపు కార్డు ఇచ్చి వడ్లను కొనుగోలు చేయాలి. కొనుగోలు కేంద్రాల వద్ద ఇతరుల పేర్ల మీద వడ్లు విక్రయిస్తున్నం. పైసల కోసం రోజులపాటు తరబడి వారి వెంట తిరుగుతున్నాం. కౌలు రైతు ఖాతాలోనే డబ్బులు జమ అయ్యేలా చూడాలి. గుర్తింపు కార్డులిచ్చి రుణ సాదుపాయం, సబ్సిడీపై ఎరువులు, పురుగుల మందులు అందజేయాలి.



మాట్లాడుతున్న నూర్జహాన్

బీడీ కార్మికుల వేతనాల పెంపు కార్మికుల విజయం

- సీఐటీయూ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీడీ కార్మికుల వేతనాలు పెంపు బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల విజయం అని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. బీడీ కార్మికుల వేతనాలు పెంపు పై సిఐటియు ఇతర కార్మిక సంఘాలు యజమాన్యం సంఘాల మధ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో సిఐటియు కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికులకు , ప్యాకర్లకు, బట్టి చాటన్ తదితరుల కార్మికులకు బీడీ యజమాన్యం ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి మూల వేతనం ఒప్పందం జరుగుతుంది. సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ నోటీస్‌లకు ఆందోళనకు దిగివచ్చి బీడీ యజమాన్యం నిన్న హైదరాబాద్ కొంపల్లి మినర్వా గ్రాండ్ హోటల్లో సిఐటియు ఇతర కార్మిక సంఘాలతో చర్చలు జరిగాయి. ఈ చర్చలలో బీడీ యజమాన్యంతో చేసుకున్న ఒప్పందం బీడీలు చుట్టే వారికి ప్రస్తుతం 1000 బీడీలకు రూ 245.80 అందుతుండగా, దానికి 4,25 పైసలు పెరిగింది. బోనస్ లతో కలిపి వేతనం రూ 249.99 కి చేరుతుంది. కొత్త ఒప్పందం ప్రకారం మే నెల నుండి అమలు చేస్తామని బీడీ యజమాన్యం తెలిపినట్టు తెలిపారు. రెండేళ్ల పాటు ఇవి అమల్లో ఉంటాయని, చేసిన కొత్త వేతన ఒప్పందం అన్ని బీడీ కంపెనీలలో అమలు అయ్యే విధంగా బీడీ యజమాన్యం చొరవ చూపించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బీడీ యూనియన్ నాయకులు, జమీల్, నవీన్, మైనుద్దీన్, గోవర్ధన్ ఘాజి, నవాబ్, అప్సర్, తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికపై లైంగికదాడి

- ఫోక్సో కేసు నమోదు

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని ఓ కాలనీలో 12 ఏళ్ల బాలికపై లైంగికదాడి చోటుచేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ కాలనీలో తల్లితోపాటు బాలిక అద్దె ఇంట్లో ఉంటుంది. తల్లి జీవనోపాధి కోసం కూలి పని చేయడానికి కూతుర్ని ఇంట్లో ఉంచి ప్రతిరోజులాగే పనికి వెళ్ళింది. తల్లి వెళ్ళగానే ఓ వ్యక్తి చిన్నారికి మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో బాలికకు రక్తస్రావం కావడంతో తల్లికి సమాచారం ఇచ్చింది. సమాచారం అందుకున్న తల్లి వెంటనే ఇంట్లోకి వచ్చి తన కూతుర్ని చూసి బోరున విలపించి పోలీస్ స్టేషన్ కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు తీసుకున్న సీఐ రవికుమార్ తన సిబ్బందితో కలిసి సదరు కాలనీకి వెళ్లి పరిశీలించారు. బాలికను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా లైంగికదాడి చేసిన వ్యక్తిపై ఫోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసినారు.

307 కేంద్రాల్లో కొనుగోలు పూర్తి

- 43 కేంద్రాల్లో త్వరలో పూర్తిచేస్తాం
- అదనపు కలెక్టర్ చంద్రమోహన్



రైస్‌మిల్‌ను తనిఖీ చేసి వివరాలు ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-భిక్కనూర్/దోమకొండ

కామారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 307 కేంద్రాలలో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేశామని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. ఆదివారం భిక్కనూరు, దోమకొండ మండలాలలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను సందర్శించి పలు సూచనలు చేశారు. ముందుగా భిక్కనూర్ మండలంలోని అంతంపల్లి రామేశ్వర పల్లి, బిక్కనూర్ లో కొనుగోలు కేంద్రాలను, జంగంపల్లిలో శాకంబరి రైస్ మిల్లును, దోమకొండలో కొనుగోలు కేంద్రాన్ని, ముత్యంపేటలో నందిని రైస్ మిల్లును పౌర సరఫరాల ఇన్చార్జి జిల్లా మేనేజర్ నిత్యానందంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 307 కేంద్రాలలో కొనుగోలు పూర్తయ్యాయని, ఇంకా 43 కేంద్రాలు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. అందులో కూడా నేడు, రేపు చాలా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ఆదివారం నాడు 116 లారీలు సమకూర్చి 2, 795 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించామని స్పష్టం చేశారు. జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు రైస్ మిల్లర్లు అధికంగా అన్ లోడింగ్ పాయింట్లను పెట్టుకొని రోజు 15 నుండి 18 లారీలు దించుకుంటున్నట్టు తెలిపారు. తూకం వేసి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలను తరలించి కేంద్రాలను క్లోజ్ చేయవలసిందిగా నిర్వాహకులకు సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 51,493 మంది రైతుల నుండి రూ.664 కోట్ల విలువ గల 3,01,545 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 90 శాతం మేర అనగా రూ. 572 కోట్లు రైతులు ఖాతాలో జమ చేశామని, 95 శాతం ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తయిందని, మిగతా రైతులకు ఒకటి, రెండు రోజుల్లో డబ్బులు చెల్లిస్తామని చంద్రమోహన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారులు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు

సీడ్స్‌షాప్‌వారు ఇచ్చిందే విత్తనం

- విత్తనాలు నాణ్యమైనవేనా..?
- ఈసారైనా రైతులకు బిల్లులు ఇచ్చేనా
- సీడ్స్, ఫర్టిలైజర్ షాపుల ఇష్టారాజ్యం
- పంట చేతికి రాకపోతే ఎవరిది బాధ్యత..?
- తనిఖీలు అంతంతమాత్రమే
- ప్రారంభమవుతున్న ఖరీఫ్ సాగు

నవతెలంగాణ-భిక్కనూర్



ఖరీఫ్ సీజన్ మొదలవుతుంది. సంవత్సర కాలం నుండి అడపాదడపాగా విత్తనాలను అమ్మిన విత్తన దుకాణదారులు ఈ ఒక్క ఖరీఫ్ సీజన్లోనే సంవత్సర లాభాన్ని పొందుతారు. పుట్టగొడుగుల్లా మండలం నుండి గ్రామాల వరకు పుట్టుకొస్తున్న విత్తనాల షాపుల కారణంగా ఒక్కో విత్తనాల షాపులలో ఒక్కో రకమైన కంపెనీలకు చెందిన విత్తనాలను రైతులకు విక్రయిస్తూ రైతులు ఏ కంపెనీకి చెందిన విత్తనాలు బాగుంటాయో, ఏ విత్తనం వేస్తే పంట చేతికి వస్తుందో తెలియక విత్తనాల దుకాణాల యజమానులు ఇచ్చిన విత్తనాలను గుడ్డిగా నమ్మి వేస్తూ తీరా సమయానికి పంట చేతికి రాకపోవడంతో లబోదిబోమంటూ ఆగమవుతున్నారు.

ఖరీఫ్ సాగు ప్రణాళికను అధికారులు ప్రకటించారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సుమారు 5 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవనుండగా.. అందులో ఎక్కువగా వరి 3 లక్షల పై చిలుకు ఎకరాల్లో సాగు కానున్నట్టు అధికారులు అంచనా వేశారు. అయితే నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని ఒకవైపు వ్యవసాయ అధికారులు విత్తనాల దుకాణ యజమానులకు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ కొందరు నాసిరకమైన విత్తనాలను రైతులకు అంటగట్టి తమ జేబులు నింపుకుంటున్నారు. తీరా పంట చేతికి రాకపోవడంతో ఇదేమిటని విత్తనాల దుకాణదారులను ప్రశ్నిస్తే మాకు ఏమీ తెలియదని కంపెనీ వారిదే పూర్తి బాధ్యత అని తప్పించుకుంటున్నారు. విత్తనాల కొనుగోలు సమయంలో తప్పనిసరిగా విత్తనాల దుకాణదారుల నుండి బిల్లు తీసుకోని పంట చేతికి వచ్చేవరకు బిల్లులు జాగ్రత్తగా కాపాడుకోవాలని వ్యవసాయ అధికారులు ఒకవైపు రైతులకు అవగాహన కల్పిస్తున్న రైతులకు బిల్లులు ఇవ్వకుండా బిల్లు ఇస్తే ధర ఎక్కువ అవుతుందని బిల్లు లేకుండా ఇస్తే ధర తక్కువ అవుతుందని రైతులకు మాయమాటలు చెప్పి బిల్లు ఇవ్వకుండానే కొందరు విత్తన దుకాణదారులు విత్తనాలను విక్రయిస్తూ జోరుగా జీరో దందందా నడిపిస్తున్నారు.

ఈసారైనా రైతులకు బిల్లులు ఇస్తారా..?

రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన బిల్లులు రైతుల వద్ద ఉంటే పంట చేతికి రాని సమయంలో విత్తన దుకాణదారుడుపై, విత్తన కంపెనీ యాజమాన్యంపై కేసు నమోదు చేసి నష్టపరిహారాన్ని పొందవచ్చు. కానీ విక్రయ దారులు ఎక్కడ తమపై నింద పడుతుందో నన్న భయంతో బిల్లులు ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారు. బిల్లులు ఇవ్వాలని వ్యవసాయ అధికారులు కఠినమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ అవి తమకేమీ వర్తించవన్నట్లు విత్తన దుకాణదారులు వ్యవహరిస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్లోనైనా కఠినమైన ఆదేశాలు ఇచ్చి రైతులకు బిల్లులు అందజేస్తారా..?, ఈసారి కూడా తూతూ మంత్రంగానే ఆదేశాలు ఇచ్చి వ్యవసాయ అధికారులు చేతులు దులుపుకుంటారా వేచి చూడాలి.

సీడ్స్ యజమానులు ఇచ్చిందే విత్తనాలు...

వాస్తవానికి రైతులకు ఏ కాలంలో ఏ పంట వేయాలో తెలుసు కానీ ఏ కంపెనీకి చెందిన విత్తనం వేస్తే పంట చేతికి వస్తుందో తెలియక తికమక పడుతుంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విత్తన షాప్ యజమానులు ఇచ్చిన విత్తనాలను కొనుగోలు చేసి పంటలు వేస్తుంటారు. ఎక్కడ చూసినా పుట్టగొడుగుల్లా ఏర్పడుతున్న ఒక్కో విత్తనాల దుకాణాలలో ఒక్కో రకమైన కంపెనీకి సంబంధించిన విత్తనాలను విక్రయిస్తుంటారు. అందులో ఏ విత్తనాలు నాణ్యమైనవో ఏ విత్తనాలు వేస్తే పంట చేతికి వస్తుందో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. విత్తనాల యజమాని ఇచ్చిన విత్తనాలను గుడ్డిగా నమ్మి రైతులు పంటలు వేస్తుంటారు.

పంట చేతికి రాకపోతే ఎవరిది బాధ్యత...?

విత్తనాల యజమానులు చెప్పిన విత్తనాలను గుడ్డిగా నమ్మి కొనుగోలు చేసి పంట వేసిన తర్వాత పంట చేతికి రాకపోతే ఎవరిది బాధ్యత..? వాస్తవానికి కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన బిల్లులు పంట చేతికి రాకపోయే వరకు రైతు వద్ద ఉంటే విత్తనాలను విక్రయించిన దుకాణదారుడే పూర్తి బాధ్యత ఉంటుంది. ఒక్క బిల్లు ఆధారంగా విత్తనాల యజమానిని, విత్తనాలకు సంబంధించిన కంపెనీల పై కేసులు నమోదు చేసి పూర్తి నష్టపరిహారాన్ని పొందవచ్చు. కొందరు విత్తనాల దుకాణదారుడు పైకి రాకుండా తప్పించుకునే ప్రయత్నంలో భాగంగానే బిల్లులు ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారు.

గతంలో నామమాత్రంగా తనిఖీలు

ఖరీఫ్ సీజన్ మొదలవగానే ఒక్కసారిగా వ్యవసాయ అధికారులు, పోలీసుల సహకారంతో విత్తనాల దుకాణాలపై దాడులు చేసి తనిఖీలు నిర్వహించి రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని ఆదేశాలు, హెచ్చరికలు జారీ చేసి వెళ్లిపోవడమే తప్ప ఎక్కడ కూడా రైతులకు పంట నష్టం జరిగితే విత్తనాల దుకాణాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తీరా పంట చేతికి రాకపోతే విత్తన దుకాణదారులు ప్రకతిపై తోసేసి సరైన పద్ధతిలో పంట వేయలేదని రైతులకే పాఠాలు చెప్పి తప్పించుకుంటున్నారు.

ఇప్పటికైనా జిల్లా వ్యవసాయ అధికారులు విత్తనాల దుకాణదారులకు రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, ఇచ్చిన బిల్లులకు సంబంధించిన పూర్తి రికార్డులు నమోదు చేయాలని బిల్లులు ఇవ్వని దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు తూతూ మంత్రంగానే జారీ చేసి వదిలేస్తారా..?, కఠినమైన ఆదేశాలు ఇచ్చి తప్పనిసరిగా రైతులకు బిల్లులు అందే విధంగా చర్యలు తీసుకుంటారా..?, పంట నష్టపోయిన రైతులను కాపాడాల్సిన వ్యవసాయ అధికారులు నకిలీ విత్తనాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు నకిలీ విత్తనాలపై నిఘా ఏర్పాటు చేసి రైతులకు బిల్లులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కఠినమైన ఆదేశాలు ఇవ్వాలని రైతులు కోరుచున్నారు.

బిల్లులు ఇవ్వకుంటే చర్యలు తప్పవు

డీఏవో భాగ్యలక్ష్మి

రైతులకు బిల్లులు ఇవ్వకుంటే మాత్రం విత్తనాల దుకాణదారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని, విత్తనాలు విక్రయించిన తర్వాత ఏ రైతుకు విక్రయించారో రికార్డు నమోదు చేసి రైతు వద్ద నుండి సంతకాలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. రైతులు విత్తన కొనుగోలుకు సంబంధించిన బిల్లులను, విత్తనాల కవర్లను పంట చేతికి వచ్చేవరకు జాగ్రత్తగా కాపాడుకోవాలని, పంట నష్టం జరిగితే విత్తన దుకాణాలపై, కంపెనీలపై కేసులు నమోదు చేసి నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు.

ఎల్‌ఓసి అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

నికాల్పూర్ గ్రామానికి చెందిన గంట గంగాధర్ గారికి అనారోగ్యం కారణంగా నిమ్స్ ఆసుపత్రి లో చికిత్స నిమిత్తం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోని 3లక్షల రూపాయలు ఎల్‌ఓసి ఆదివారం అందించారు. ఎల్‌ఓసీల ద్వారా పేదవారి ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ చూపించిన వినయ్ రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఎల్‌ఓసి అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బారడి పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ - పోతంగల్

మండల కేంద్రంలో ప్రతి సంవత్సరం నిర్వహించే బారడి పోచమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఈస ందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు.



పూజలో పాల్గొన్న గ్రామస్తులు

సైలాని బాబా దర్గాను సందర్శించిన చార్మినార్ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ

నవతెలంగాణ- రెంజల్

ండలంలోని నీల గ్రామ సమీపంలో ఉన్న సైలాని బాబా దర్గాను పాతబస్తీ చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ శనివారం రాత్రి సందర్శించి ప్రత్యేక ప్రార్థనలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో తాను గెలుపొందినట్లయితే తిరిగి దర్గాను సందర్శించుకుంటానని మొక్కుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా దర్గాను సందర్శించి సైలాని బాబాకు చాదర్ కప్పి పూలమాలలతో సత్కరించి ప్రత్యేక ప్రార్థనలను చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట దర్గా నిర్వాహకులు వహీద్ బాబా, కొప్పర్ గా మాజీ సర్పంచ్ ఖలీల్ పటేల్, ఎస్ఎస్ యుఐ మాజీ మండల అధ్యక్షులు హాజీ ఖాన్, మూస, దర్గా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులు పోరాటానికి సన్నద్ధం కావాలి



చంద్రసింహ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మున్సిపల్ కార్మికుల హక్కులకై పోరాటానికి సన్నద్ధం కావాలని చంద్ర సింహ సంతాప సభలో నాయకులు పిలుపు నిచ్చారు. మున్సిపల్ కార్మిక సిఐటియు నాయకుడు చంద్ర సింహ సంతాప సభ సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి యూనియన్ గౌరవాధ్యక్షులు ఏ రమేష్ బాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు నిత్యం పని భారంతో కనీస వేతనాలు అమలు కాక ఉద్యోగ భద్రత లేక సతమతమవుతున్న సందర్భంలో వారి పక్షాన కార్మికుల హక్కులకై పోరాడిన వ్యక్తి చంద్ర సింహ అని అన్నారు. ఆంధ్రప్రదేశ్లో మున్సిపల్ కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వేతనాల కన్నా ఎక్కువ ఇస్తున్నారని, ఆ వేతనాలను తెలంగాణలో కూడా అమలు జరుపుతామని గత ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ నేటికీ అమలు కావటం లేదని తెలిపారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి ఉద్యోగ భద్రత లేకుండా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను ఇవ్వకుండా పని భారాన్ని మోపుతున్నారని వాపోయారు. ప్రశ్నించిన వారి పైన వేధింపులకు పాల్పడుతున్నారని, అదేవిధంగా కనీసం చనిపోయిన కార్మికులకు గత పది సంవత్సరాల నుండి ప్రభుత్వం దహన సంస్కారాలకు 20వేల రూపాయలు ప్రకటించినప్పటికీ వాటిని కూడా ఇవ్వకుండా నిజామాబాద్‌లో జిల్లాలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఐక్యంగా పోరాడినప్పుడే కనీస వేతనాలు అమలు అవుతాయని, అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని, అందుకు కార్మికులు సిద్ధపడాలని ఆయన పిలుపునిచ్చారు ఈ సంతాప సభలో మున్సిపల్ యూనియన్ నాయకులు భూపతి, ఏకనాథ్, వర్మ, శంకర్, మోహన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారి కుటుంబానికి యూనియన్ తరపున ఆర్థిక సహకారం అందించారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు



నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ పట్టణంలోని డి-9 సెక్షన్ సుభాష్ నగర్ సబ్ స్టేషన్‌లో ప్రస్తుతం 5 ఏంఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అదనంగా మరొక 3.15 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ ద్వారా పట్టణంలో సుభాష్ నగర్ హమల్ వాడి, కంటేశ్వర్, నాందేవ్ వాడ, విద్యుత్ నగర్, బ్యాంక్ కాలనీ, పాముల బస్తి ప్రాంతాలలో నాణ్యమైన విద్యుత్ అందించడానికి చర్యలు చేపడుతున్నారు. ఈ పనులను ఆదివారం ఉదయం నుంచి ఆపరేషన్ ఏస్ఈ ఆర్ రవీందర్, ఆపరేషన్ డిఈ ఎం.శ్రీనివాస్ రావు, ఏడిఈ టౌన్ 2 తోట రాజశేఖర్, సుభాష్ నగర్ ఏఈ గంగా శేఖర్ పర్యవేక్షించారు, స్థానిక సిబ్బంది దేవదాస్ , లైన్ ఇన్‌స్పెక్టర్ గజేందర్, లైన్మెన్ రమేష్ ,సంజీవ్ ,ప్రేమ్ లాల్, దశరథ్, కృష్ణయ్య సుధాకర్, పరమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు..

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

- 'పది' ఫలితాల్లో సత్తా చాటిన సర్కారు బడులు
- 10 జీపీఏ సాధించిన 103 మంది విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ పాఠశాలలు అంటే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నెలకొని ఉండే అపనమ్మకం క్రమేణా దూరమవుతోంది. ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు చెందిన పిల్లలే ప్రభుత్వ బడులలో చదువుతారనే భావన చెరిగిపోతూ, ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. మధ్య తరగతి వారితో పాటు, సంపన్న శ్రేణికి చెందిన అనేక కుటుంబాలు సైతం తమ బిడ్డల ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ వంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థలలో ప్రవేశాలు లభిస్తుండడం, జవహర్ నవోదయ విద్యాలయాలలో చదువుకునే అవకాశం లభిస్తుండడం అందరినీ ఆలోచింపజేస్తోంది. నాణ్యమైన బోధన, మెరుగైన మౌలిక సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలలు ఏటికేడాది ఉత్తమ ఫలితాలను సాధిస్తుండడం ఈ మార్పునకు కారణం అవుతోంది. ప్రైవేటు బడులకే పరిమితమైన ఆంగ్ల మాధ్యమ బోధన ప్రభుత్వ పాఠశాలల్లోనూ అందుబాటులోకి రావడంతో అనేక మంది మొగ్గు చూపుతున్నారు. హంగు, ఆర్భాటాలతో హడావుడి చేసే ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ బడులు అద్వితీయ ఫలితాలను నమోదు చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇటీవలే ప్రకటించిన 2024 పదవ తరగతి వార్షిక ఫలితాలలో సర్కారీ బడులలో చదివిన విద్యార్థిని, విద్యార్థులు ప్రైవేటు పాఠశాల సైతం విస్తుపోయేలా తమ సత్తా చాటారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు ఈ ఒక్క జిల్లా నుండే ఏకంగా 103 మంది బాలబాలికలు 10/10 జీపీఏ సాధించడం విశేషం. ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయంగా మెరుగుపడిన విద్యా ప్రమాణాలకు ఈ ఫలితాలు తార్కాణంగా నిలిచాయి. మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులతో పాటు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, మైనారిటీ రెసిడెన్షియల్ బడులలో చదివిన అనేకమంది బాలబాలికలు 10 గ్రేడ్ పాయింట్లు సాధించి సత్తా చాటారు. అన్నింటికి మించి రెసిడెన్షియల్, ఆదర్శ పాఠశాలలే కాకుండా ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైతం 10/10 గ్రేడ్ పాయింట్స్ సాధించి సర్కారీ బడుల ఖ్యాతిని చాటారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పన పనులను చేపట్టి అన్ని సౌకర్యాలను మెరుగుపర్చడం, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంపుపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తుండడం సత్ఫలితాలు సాధనకు దోహదపడుతోంది. ఉపాధ్యాయులు సైతం సర్కారీ బడులలో నాణ్యమైన విద్యను బోధిస్తూ, విద్యార్థులు స్వచ్ఛందంగా ప్రవేశాల పట్ల ఆకర్షితులయ్యేలా కృషి చేస్తున్నారు. అన్ని వసతులతో కూడిన ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులకు క్రీడలలోనూ భాగస్వామ్యం చేస్తూ వారి శారీరక, మానసిక అభివృద్ధికి దోహదపడుతున్నారు. అన్నింటికి మించి పదవ తరగతి విద్యార్థులకు సాధారణ తరగతులతో పాటు స్పెషల్ క్లాసెస్ నిర్వహిస్తూ అత్యుత్తమ ఫలితాలు సాధించేలా జిల్లా పాలనాధికారి పర్యవేక్షణలో జిల్లా విద్యా శాఖ ప్రత్యేక కృషిని కొనసాగిస్తుండడం సత్ఫలితాలను అందిస్తోంది.



నిజామాబాద్ నగరంలోని బోర్గాం జడ్పీహెచ్ఎస్ (ఫైల్)

10/10 జీపీఏ సాధించిన ప్రభుత్వ బడులు ఇవే..

బాల్కొండ, సాలూర, నూత్పల్లి, కంజర మహాత్మా జ్యోతిబాపూలే, సుద్దపల్లి, కంజర, ధర్మారం, పోచంపాడ్, ఆర్మూర్ రెసిడెన్షియల్ పాఠశాల, చీమన్‌పల్లి పాఠశాల, పోచంపాడ్, ఎడపల్లి, కంజర బాలుర రెసిడెన్షియల్ స్కూల్, రాంపూర్ పాఠశాల, బాల్కొండ, ఆలూర్ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, పెర్కిట్, ఇందల్వాయి కేజీబీవీ, మామిడిపల్లి, డిచ్‌పల్లి, ధర్పల్లి, జక్రాన్‌పల్లి ఆదర్శ పాఠశాల, బాల్కొండ పాఠశాల, బోర్గామ్ జెడ్పి హైస్కూల్, ముప్కాల్ హైస్కూల్, నవీపేట్ బాలికల ఉన్నత పాఠశాల, ఆలూర్ హైస్కూల్, ఇస్సాపల్లి హైస్కూల్, వేల్పూర్ హైస్కూల్, ముప్కాల్ హై స్కూల్, తల్వేద, ఐలాపూర్, మూచ్కుర్, పడకల్, వెల్మల్, పోచంపాడ్, తొండాకూర్ స్కూల్, మోతె, బాల్కొండ, డొంకేశ్వర్, కమ్మరపల్లి, భీంగల్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులు 10 జీపీఏ సాధించి తమ ప్రతిభను చాటారు.

ఐఐటీ లో సీటు సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తా



- పల్లవి (దాస్ నగర్, ఎం.జె.పీ పాఠశాల విద్యార్థిని)

వ్యవసాయ కుటుంబ నేపథ్యం కలిగిన తాను ప్రతిష్టాత్మక విద్యా సంస్థలో ఐ.ఐ.టీలో సీటు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. బాసరలోని ట్రిపుల్ ఐ.టీలో చదువుతున్న మా అన్నను స్ఫూర్తిగా తీసుకుని ఈ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాను. పదవ తరగతిలో 10 గ్రేడ్ పాయింట్స్ రావడానికి పాఠశాలలో ఉపాధ్యాయులు అందించిన బోధన ఎంతగానో దోహదపడింది. అన్ని వసతులను అందుబాటులో ఉంచుతూ, ప్రణాళికాబద్ధంగా పాఠాలను బోధించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తా అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తానని పూర్తి నమ్మకం ఉంది.

తల్లిదండ్రుల కలను సాకారం చేస్తా

- దాక్షాయణి, (బోర్గాం, జెడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని)



తాను గొప్ప ఇంజనీర్ అయి తల్లిదండ్రుల కలను సాకారం చేస్తా. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే అనుకున్న గమ్యాన్ని సాధించవచ్చు. ఈ దిశగా కీలకమైన పదవ తరగతి వార్షిక పరీక్షల్లో 10 గ్రేడ్ పాయింట్స్ సాధించడం ఆత్మవిశ్వాసాన్ని ద్విగుణీకృతం చేసింది. ఉపాధ్యాయులు అంకిత భావంతో పాఠ్యాంశాలు బోధిస్తూ, క్రమశిక్షణను అలవర్చడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి. తన తండ్రి ఆటో డ్రైవర్, తల్లి గృహిణిగా కుటుంబాన్ని పోషిస్తున్నారు. భవిష్యత్తులో ఇంజనీర్ అయి వారికి చేయూతగా నిలుస్తా.

ఐపీఎస్ సాధించడమే లక్ష్యం

- సీహెచ్.అంకిత . దాస్ నగర్, మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల



సివిల్స్ పరీక్షలు రాసి ఐపీఎస్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. నా తల్లిదండ్రులు, గురువుల తోడ్పాటుతో తప్పనిసరిగా లక్ష్యాన్ని సాధిస్తానని గట్టి నమ్మకం ఉంది. పదవ తరగతిలో 10 గ్రేడ్ పాయింట్స్ సాధించడం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది. ప్రస్తుతం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంపై దృష్టి పెట్టాను. పాఠశాలలో చక్కటి ప్రణాళికతో, అర్థమయ్యే విధంగా బోధన చేయడం అత్యుత్తమ మార్కుల సాధనకు దోహదపడింది. ఖో-ఖో, అథ్లెటిక్స్ లోనూ చక్కటి ప్రవేశం ఉండేలా తీర్చిదిద్దారు. తన ప్రతిభను గుర్తించిన ఉపాధ్యాయులు ఐఐటీ తరగతులను అదనంగా బోధించే పఠాన్ చెరు ఇంద్రేశం వద్ద గల ఎంజెపీలో తనను రెండేళ్ల పాటు చదివించారు. పదవ తరగతి పరీక్షలను తిరిగి దాస్ నగర్ పాఠశాల నుండే రాశాను. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తా, తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తెస్తా.

జ్యోతిబాపూలే విద్యా సంస్థలోనే ఇంటర్‌లో చేరాను

- జీవని, (దాస్ నగర్, ఎం.జె.పీ పాఠశాల విద్యార్థిని)



చక్కటితో ప్రణాళికతో బోధనను అందిస్తున్న దాస్ నగర్ వద్ద గల మహాత్మా జ్యోతిబాపూలే విద్యా సంస్థలోనే ఇంటర్మీడియట్ కోసం అడ్మిషన్ తీసుకున్నాను. ఇక్కడి ఉపాధ్యాయులు అర్థమయ్యే రీతిలో బోధన చేయడమే కాకుండా అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ, చక్కటి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. నూటికి నూరు శాతం సిలబస్‌ను పూర్తి చేసి, పరీక్షలకు ముందు పునశ్చరణ తరగతులు నిర్వహించడం, ఎలాంటి ఒత్తిడికి లోను చేయకుండా పాఠాలను సులభంగా ఆకళింపు చేసుకునేలా తర్ఫీదును ఇవ్వడం వల్ల పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదపడింది. వసతి, సదుపాయాల విషయంలోనూ ఎలాంటి లోటు లేకుండా ఇంటి వాతావరణాన్ని మరిపించారు. ఇప్పటికైతే మంచి మార్కులతో ఇంటర్ పూర్తి చేశాక, బీ.టెక్ చేయాలని నిర్ణయించుకున్నాను.

కంపెనీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బోధన్‌లో రేక్ ప్రారంభం

సొసైటీలకు ఫెర్టిలైజర్ డీలర్లకు అందుబాటులో

నవతెలంగాణ-బోధన్

కోరమండల్ ఇంటర్నేషనల్ కంపెనీ ఎరువుల పంపిణీ సేవలను సొసైటీలు సద్వినియోగం చేసుకోవాలని కోరమండల్ జోనల్ మేనేజర్ మనోజ్ కుమార్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని రైల్వే స్టేషన్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ బోధన్‌లో రేక్ ప్రారంభించడం మూలంగా చుట్టుపక్కల ఉన్న సొసైటీలకు, ఫర్టిలైజర్ డీలర్స్‌కు ఉపయోగ కరంగా ఉంటుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిజామాబాద్ కన్నా కూడా బోధన్ సమీపంలో ఉండడంవల్ల ట్రాన్స్‌ఫోర్ట్ ఛార్జిలు తగ్గుతాయని అన్నారు. వెంటనే చుట్టుపక్కల ఉన్న డీలర్స్, సొసైటీలకు ఫెర్టిలైజర్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. అనంతరం డాక్టర్ సునీల్ కుమార్ చౌదరి మాట్లాడుతూ ఫర్టిలైజర్స్ బోధన్‌లో రైల్వే లైన్ రేక్ ద్వారా మొట్టమొదటిసారిగా అందుబాటులోనికి తెచ్చిన కోరమండల్ ఇంటర్నేషనల్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీలకు ట్రాన్స్‌పోర్ట్ చార్జిలు తగ్గి కొంత ప్రయోజనం చేకూరుతుందని, సొసైటీలకు, డీలర్లకు, రైతులకు ఎల్లప్పుడూ ఫర్టిలైజర్స్ అందుబాటులో ఉంటాయని అన్నారు. బోధన్‌లోని లారీ ఓనర్స్ కి, హమాలీలకి కొంత బిజినెస్ ఎక్కువగా జరుగుతుందన్నారు. రేక్ ఏర్పాటు చేయడం రైతులకి చుట్టుపక్కల ఉన్న డీలర్ల చాలా లాభదాయకం అని అన్నారు. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ మాస్టర్ రాము, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ మహేశ్వర్ రెడ్డి , కొత్తపల్లి సొసైటీ చైర్మన్ డాక్టర్ సునీల్ కుమార్ చౌదరి, బోధన్ అగ్రికల్చర్ ఆఫీసర్ సంతోష్, నిజామాబాద్ దీపక్ అగర్వాల్ ఓంకార్ డీలర్స్, బోధన్ శ్రీనివాస డీలర్స్, డ్రైవర్స్, హమాలీలు పాల్గొన్నారు.



కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్ మనోజ్ కుమార్

యూనివర్సిటీలో నమూనా పరీక్ష

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గోల్కొండ అకాడమీ సౌజన్యంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన గ్రూప్-1, 2 గ్రాండ్ టెస్ట్‌లో భాగంగా తెలంగాణ యూనివర్సిటీలో గిరిజన శక్తి విద్యార్థి సంఘం, ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో సంయుక్తంగా నమూనా పరీక్షను ఆదివారం నిర్వహించారు. పరీక్షలను గిరిజన శక్తి విద్యార్థి సంఘం అధ్యక్షుడు శ్రీను రాథోడ్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న గ్రూప్-1, 2 ఇతరత్రా పోటీ పరీక్షలకు ఈ నమూనా పరీక్ష ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అభ్యర్థుల్లో దాగి ఉన్న భయాన్ని పరీక్షల ద్వారా తొలగించవచ్చని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో విద్యార్థుల సౌకర్యార్థం సంఘం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ యుఐ నాయకులు సాగర్ నాయక్, రాజేందర్, నిర్వాహాలు లక్ష్మణ్, శ్రీకాంత్, మోహన్, నవీన్ కుమార్ తదితరులు ఉన్నారు.



గ్రూప్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్‌తోపాటు ఎంసెట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

2023-2024 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 7 జీపీఏ లేదా ఆపై ఉత్తీర్ణత సాదించిన దివ్యాంగ విద్యార్థులకు, 2024-2025 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్‌తోపాటు ఎంసెట్ కోచింగ్ అందించుటకు ప్రఖ్యాతగాంచిన ప్రవేట్ జూనియర్ కళాశాలలలో ప్రతిభ కలిగియున్న దివ్యాంగ విద్యార్థినీ విద్యార్థులకు ప్రవేశము కల్పించుటకు గాను తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ వారు నోటిఫికేషన్ జారీచేశారని తెలిపారు. 2024-2025 విద్యా సంవత్సరానికి కార్పొరేట్ పథకం కింద 10వ తరగతిలో 7.0 జీపిఏ లేదా అంతకంటే ఎక్కువ ఉత్తీర్ణత సాధించిన అర్హులైన దివ్యాంగ విద్యార్థులు ఈనెల 15 నుండి 30 లోపు e-Pass వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, తదుపరి ఎంపికైన మొదటి దశ ఎంపికైన విద్యార్థుల జాబితాను జూన్ 03 న e-Pass వెబ్సైట్ నందు పొందపరుచబడుతుందని తెలిపారు. తదుపరి ఎంపికైన విద్యార్థుల విద్యా ధృవపత్రములను అనుసరించి చివరిగా ఎంపికైన విద్యార్థుల జాబితాను జూన్ 06 న e-Pass వెబ్సైట్ నందు పొందపరుస్తారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ఏంసిసి కోడ్‌ను అనుసరించి షెడ్యూల్ ప్రకారం చర్యలు తీసుకోనబడునని తెలిపారు. జిల్లాలో గల దివ్యాంగ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోనవలని కోరారు. ఇతరా వివరాలకై మహిళదివ్యాంగుల, శిశు వయో వృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సంక్షేమ అధికారి ఎస్.కే. రసూల్ బీ ఒక ప్రకటన లో తెలిపారు. కొత్త కలెక్టరేట్ కార్యాలయం రూం నంబరు 17 లో సంప్రదించాలని మిగతా వివరాలకు ఈ ఫోన్ నెంబర్ 08462- 251690 చేయాలని అన్నారు.

29, 30న స్థాయి సంఘ సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 29, 30 న నిర్వహించనున్నట్లు సీఈవో బి.ఉష ఒక ప్రకటనలో తెలిపారు. 29న ఉదయం 11 గంటలకు గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మధ్యాహ్నం 2 గంటలకు విద్య, వైద్యం, మహిళా, శిశు సంక్షేమం, 30న ఉదయం 11 గంటలకు సాంఘిక సంక్షేమం, పనులు, ఆర్థిక, ప్రణాళికపై సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

లాడ్జ్‌పై రైడ్.. కేసు నమోదు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో నవదుర్గ లాడ్జ్ నందు వ్యభిచారం జరుగుతుందని వన్ టౌన్ ఎస్హెచ్ఓ విజయబాబు వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నవ దుర్గా లాడ్జ్ నందు అసాంఘిక కార్యకలాపాలకు నడుపుతున్న ఏ1 గా చెన్న గంగాదాసు అలియస్ రాము, ఏ2 గా చెన్న దీక్షిత్, ఏ3 గా గుండేటి భోజన్న, ఏ4 గా సతీష్ పైన కేసు నమోదు చేసి బాధితురాలిని స్వాదర్ హోంకు పంపించినట్టు తెలిపారు.

బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన నీలరాగవులు కుటుంబానికి ఆదివారం బీమా కంపెనీ చెక్కును మాజీ సర్పంచ్ అనిల్‌రెడ్డితో కలిసి అందజేశారు. నీలా రాఘవులు ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మృతి చెందాడు. ఆయన ఓ కంపెనీ నందు పాలసీ తీసుకోగా.. రూ.5,54,750 చెక్కును నామిని అయినటువంటి మృతుడి భార్య నీలా లక్ష్మికి అందజేశారు.



బీమా చెక్కు అందజేస్తున్న మాజీ సర్పంచ్

సారంగపూర్ ఆలయం వరకు మహాపాదయాత్ర

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని పోతురెడ్డిపల్లి వీరాంజనేయ స్వామి నుండి దేవాలయము నుండి హనుమాన్ భక్తులు ఉమ్మడి జిల్లా సారంగాపూర్ హనుమాన్ మందిరమునకు ఆదివారము మహా పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లా డుతూ నూతన ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈయేడు అధిక వర్షాలు కురిసి సమృద్ధిగా పాడి పంటలతో ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లెల చూడాలని పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు తేజ స్వామి, భక్తాదులు పాల్గొన్నారు.



మహాపాదయాత్ర చేస్తున్న హనుమాన్ భక్తులు

భగభగలు.. చిరుజల్లులు

- ఉక్కపోతతో తల్లడిల్లిన ప్రజలు
- అక్కడక్కడ చినుకులతో వేడి నుంచి ఉపశమనం

నవతెలంగాణ-మద్నూర్/లింగంపేట్

కామారెడ్డి జిల్లాలో ఆదివారం భానుడు తన ప్రతాపం చూపించాడ. ఏకంగా 44.8 డిగ్రీల సగటు ఉష్ణోగ్రత నమోదు కావడంతో ఎండవేడితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కాగా పలు చోట్ల చిరుజల్లులు కురవడంతో ఉక్కపోత నుంచి ఉపశమనం లభించినట్టయింది.

మద్నూర్ మండలంలో గత రెండు రోజులుగా ఎండ తీవ్రత పెరిగింది. దీంతో జనం అల్లాడుతున్నారు. ఉదయం 10 గంటలయిందంటే అడుగు బయటపెట్టలేకపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎండతో పాటు ఉక్కపోత ఉండటంతో ప్రజలు అత్యవసరముంటేనే బయటకు వస్తున్నారు. దీంతో ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గత రెండు రోజులుగా ఎండ తీవ్రత 45 డిగ్రీలకు చేరడంతో తీవ్ర ఉక్కపోతకు గురవుతున్నారు. ఎండ వేడితో ఎక్కడ ఉన్నా ఇంట్లో గాని చెట్ల కింద గాని వేడి గర్మితో అల్లాడిపోతున్నారు. కూలర్లు పెట్టుకుంటున్నా ఉక్కపోత వీడటం లేదు. ఎండ తీవ్రతతో జనాలు జ్వరం బారిన పడుతున్నారు. ఎన్ని నీళ్ల తాగినా దాహం తీరలేక ప్రజలంతా అల్లాడిపోతు న్నారు. నడి వేసవిలో ఇటీవల అకాల కురిసిన వర్షాలతో కొద్ది రోజులు చల్లదనం నెలకొన్నా.. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో ఎండివేడి పెరిగింది. అయితే జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్దులు జాగ్రత్తగా ఉండాలని, చల్లదనం ఉండేవిధంగా చూసుకోవాలని సూచిస్తున్నారు.



భానుడి ప్రతాపంతో నిర్మానుష్యంగా మారిన రోడ్డు..



లింగంపేట్‌లో కురుస్తున్న వర్షం

కురిసిన చినుకులు.. ఉక్కపోత నుంచి ఉపశమనం

లింగంపేట్ : లింగంపేట్ మండల కేంద్రంలో సాయంత్రం వేళ ఒక్కసారిగా ఈదురుగాలతో వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి ఎండవేడితో అల్లాడుతున్న ప్రజలకు ఒక్కసారిగా వేడి నుంచి ఉపశమనం లభించినట్టయింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా కొట్టడంతో ప్రజలు రోడ్లపై తిరగలేక ఇండ్లకు పరిమితమైపోయారు. రోడ్లన్నీ నిర్మానుషంగా మారాయి. ఉక్కపోతతో జనాలు తిరగలేక వేడిని తట్టుకోలేక పోయారు. గత రెండు నెలలుగా మార్చి ఏప్రిల్ మే నెలలో ఎండలు రోజురోజుకు తీవ్రం కావడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. ఆదివారం మధ్యాహ్నం చిరుజల్లులు కురవడంతో కింద నుండి ఉపశనం ప్రజలు పొందుతున్నారు కొద్దిగా వాతావరణం చల్లబడిందని ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

3 సెల్‌ఫోన్‌లు రికవరి.. అందజేత



పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్సై మహేష్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ముగ్గురు బాధితులు పోగొట్టుకున్న 3 సెల్‌ఫోన్‌లను సిఇఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం వాటిని బాధితులకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మహేష్ అందజేశారు. తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవునిపల్లి గ్రామానికి చెందిన నీల కిష్టయ్య ఫోన్ గత ఏడాది నవంబర్ 13 వ తారీకు నాడు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో పోగొట్టుకున్నారని తెలిపారు. హసన్ పల్లి గ్రామానికి చెందిన కుశలకంటి దుర్గయ్య మార్చి 11న, ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన గణపతి కుమార శర్మ ఫోన్‌ను ఏప్రిల్ 15 తేదీనా పోగొట్టుకున్నట్టు తెలిపారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఈసీ ఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌లను గుర్తించి వారికి అందించామని తెలిపారు.

పలు గ్రామాల్లో బోనాల పండుగ



బోనాలతో గ్రామ ప్రజలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం గ్రామ దేవతలకు కులదేవతలకు గ్రామస్తులు కులాస్తులు బోనాల పండుగను నిర్వహించారు. లింగంపేట్ మండలంలోని లింగంపల్లి గ్రామంలో లింగంపల్లి గ్రామ ముదిరాజ్ కులస్తులు వారి ఆరాధ దైవమన పెద్దమ్మ తల్లికి బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఓడి బియ్యం నైవేద్యం సమర్పించి టెంకాయలు కొట్టి మొక్కలు తీర్చుకున్నారు. మత్తడి పోచమ్మ ఆలయం వద్ద ఆదివారం దూర ప్రాంతాల నుంచి వందలాది మది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వచ్చి మొక్కలు తీర్చుకున్నారు. గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయం వద్ద ఆయా కులాలకు చెందిన పలువురు మహిళలు అమ్మవారి వద్దకు వచ్చి టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఎల్ఈడి ఫ్లడ్ లైట్ వితరణ

నవతెలంగాణ-దోమకొండ

బీబీపేట్ మండల కేంద్రం లోని పోలీస్ స్టేషన్‌కు మండల కో అప్షన్ మెంబర్ ఆసిఫ్ ఆధ్వర్యంలో ఎస్సై ప్రభాకర్‌కు ఎల్ఈడి ఫ్లాడ్ లైట్ ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై ప్రభాకర్ మాట్లాడుతూ బీబీపేట గ్రామంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయానికి సహకరించి ఎల్ఈడి ఫ్లాడ్ లైట్ అందించినందుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌లు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం రోజు 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున సమావేశానికి ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన తెలిపారు. శాఖల వారీగా అధికారులందరూ ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

పలు గ్రామాల్లో బోనాల పండగ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మద్ది కుంట, కన్నాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఆదివారం పోచమ్మ పండగ నిర్వహించారు. కులాల కతీతంగా అందరూ ఒక్కటై పోచమ్మకు ఆడపడుచులు బోనమెత్తి, బోనంతోపాటు నైవేద్యాన్ని గ్రామ దేవతలకు సమర్పించారు. ఈ సందర్భంగా పిల్లాపాపను ఆరోగ్యంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో అందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నట్టు గ్రామస్తులు తెలిపారు.



బోనాలతో గ్రామా ప్రజలు

ఘనంగా రథోత్సవం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని తుక్కోజివాడి గ్రామంలో ఆదివారం ఘనంగా రథోత్సవం నిర్వహించారు. శ్రీ కృష్ణ మందిరం ఆధ్వర్యంలో ప్రధాన వీధులగుండా రథ పై శ్రీ కృష్ణ విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యేకంగా వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



బోనాలతో గ్రామా ప్రజలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. మండలంలోని పద్మాజివాడి, మోడేగాం గ్రామాల్లో సదాశివనగర్ గ్రామాల్లో పోచమ్మ పండుగ సందర్భంగా బోనాల ఊరేగింపుగా ఆలయల వరకూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పద్మాజివాడి గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు.

బడాపహాడ్‌లో నిత్యదోపిడీ

- రూముల అద్దెపై నియంత్రణేది..?
- ఒక్కో రూమ్‌కు 500 నుంచి 3000 వసూలు
- వేసవి నేపథ్యంలో అమాంతం పెంచి వసూలు
- శిథిలావస్థలో ప్రభుత్వ ధర్మశాలలు

నవతెలంగాణ-వర్ని



సర్వమత సమ్మేళనానికి నిదర్శనంగా నిలిచే బడాపహాడ్(పెద్దగుట్ట)కు వెళ్తే.. సందర్శకులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. గతంలో గుట్టపై నిర్వహణను కాంట్రాక్టర్‌కు అప్పగిస్తుండగా.. అందినకాడికి సందర్శకుల నుంచి దోపిడీ చేస్తున్నట్టు పెద్దఎత్తున ఆరోపణలు వ్యక్తమవుతూనే ఉండేవి. ప్రస్తుతం కాంట్రాక్ట్ గడువు ముగియడంతో వక్ఫ్‌బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహణ చూస్తున్నారు. అయితే గుట్ట కింద ఉండేందుకు ఏర్పాటు చేసే రూములకు ప్రయివేటు వ్యక్తులు ఇష్టానుసారంగా ధర నిర్ణయించి అందినకాడికి దండుకుంటున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వచ్చిన మందిని దృష్టిలో పెట్టుకొని ఆది, శుక్రవారాల్లో ధరలు పెంచి వసూలు చేస్తున్నారు. ఇతర ప్రత్యేక రోజుల్లో అయితే మరింత ఎక్కువ వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో రూమ్‌కు ఏకంగా రూ.1000 నుంచి మూడు వేల రూపాయలు వసూలు చేస్తున్నట్టు సమాచారం.

నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని జలాల్‌పూర్ గ్రామ పరిధిలోగల (పెద్దగుట్ట) బడా పహాడ్ షాదుల్లా హుస్సేన్ బాబా దర్గా పవిత్ర పుణ్యక్షేత్రానికి వేసవి కాలంలో పెద్దఎత్తున తరలివస్తుంటారు. ఇతర రాష్ట్రాల నుంచి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఎక్కువ సంఖ్యలో భక్తులు మొక్కలు చెల్లించడానికి వస్తు ఉంటారు. వేసవి కాలం కావటంలో మరింత ఎక్కువగా కందుర్లు చేసేవారు కుటుంబ సమేతంగా బంధువులతో పాటు విచ్చేసి వచ్చి రాత్రి నిద్ర చేయడానికి అద్దెకి రూములు తీసకుంటున్నారు.

ప్రభుత్వ రూములో నిల్, ప్రవేట్ రూములే ఫుల్

ప్రస్తుతం కాంట్రాక్టర్ల పరిధిలో లేకున్న వక్ బోర్డు అధికారుల పరిధిలో ఉన్న ప్రభుత్వ సంబంధింత రూములు లేకపోవటంతో దర్గాకు వచ్చి మొక్కులు చెల్లించే భక్తులకు ప్రవేట్ రూములు అద్దెకు అధిక ధరకు తీసుకోక తప్పటం లేదు. ఒక రాత్రి కి కుటుంబ సభ్యుల సంఖ్య, బంధువుల సంఖ్య చూసి రూములు ఒకటి నుంచి 5 రూములు తీసుకొని రాత్రి బస చేస్తుంటారు. ఇదే ఆసరాగా చేసుకొని ప్రవేట్ రూముల యాజమాన్యం భక్తుల నుంచి అదిక అద్దె తీసుకొంటున్నారని, ఆ అద్దె లో బాబా దర్శనం పూర్తిగా చేసుకోవచ్చని భక్తులు తెలుపుతున్నారు.

అసలే ఎండలు జోరుగా ఉన్నాయి. చెట్ల నీడ లేక, ధర్మశాలలు లేక తప్పని పరిస్థితి ప్రవీట్ రూములను అద్దెకు తీసుకోక తప్పడం లేదు. ఇదే ఆసరాగా చేసుకొని బడాపహాడ్‌లో నివసించే భక్తులు ఒకొక్క వ్యక్తికీ పది నుంచి 20 రూములు ఉంటాయి. అందులో విద్యుత్, ఫ్యాన్ల పేరుతో ఒక రాత్రి కి 500 రూపాయల నుంచి 2000 రూపాయలు వరకు అద్దెకు ఇచ్చి ప్రవేట్ రూముల వ్యక్తులు జేబులు నింపుకొంటున్నారు. దీనితో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు బాబా దర్శనం కలగా మారుతుందని భక్తులు తెలుపుతున్నారు. అధికారులు ప్రవేట్ వ్యక్తుల అద్దె రూముల కిరాయి తక్కువ ఇచ్చేలా అధికారులు, వక్ఫ్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ప్రభుత్వం తరపున రూములు లేవు

- రాజు (జగిత్యాల)

మేము జగిత్యాల జిల్లా నుంచి బాబాకు మొక్కులు చెల్లించడానికి వచ్చాము. ఇక్కడ ప్రభుత్వం నుంచి నివసించడానికి రాత్రిపూట వసతులు లేకపోవడంతో అద్దెకిరాయిల వద్దకు వెళ్తే ఒక రాత్రికి మందిని చూసి 3 వేల రూపాయల కిరాయి తీసుకుంటున్నారు. దీంతో దూరపుంతల నుంచి వచ్చి నా మాకు డబ్బుల కొరతతో షాదుల్లా బాబా దర్శనం మొక్కలు చెల్లించలేని పరిస్థితి నెలకొంటుంది. ప్రభుత్వమే రూములు కట్టి అద్దెకు అందజేస్తే ప్రయివేటు వ్యక్తులు సైతం ధర తక్కువ చేసే అవకాశం ఉంటుంది.

పంటలకు బీమాతో అన్నదాతకు ధీమా

- కాంగ్రెస్

నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం జూన్ 1న మొదలయ్యే వానాకాలం సీజన్ నుంచి రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించినట్టు మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ తెలిపారు. ఆదివారమిక్కడ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వానాకాలం సీజన్ నుంచి రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేయడంతో రైతులకు ఉపశమనం కలగనుందన్నారు. రాష్ట్రంలో ఏటా రెండు సీజన్లలో ప్రకృతి ప్రకోపాలు, ఆకాల వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, గత నాలుగేళ్ల నుంచి బిఆర్ఎస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేయకపోవడంతో పంట నష్టపోయిన రైతులకు బిఆర్ఎస్ ప్రభుత్వం నుంచి రూపాయి పంట నష్టపరిహారం దక్కలే దన్నారు. బీమా కంటే రైతులకు కట్టే ప్రీమియం ఎక్కువగా ఉందని చెప్పి ఈ పథకం అమలును రాష్ట్రంలో నిలిపివేసిందని అప్పటి నుంచి అన్నదాత పండించిన పంటలకు ఎలాంటి బీమా పథకాలు లేకపోవడంతో పంట చేతికొచ్చే సమయంలో ఆర్థికంగా నష్టపోయారన్నారు. దీనిని నివారించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న ఖరీఫ్ సీజన్ నుంచే పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని రూ.3,000 కోట్లు సంవత్సరానికి పంటల మీద బీమా పథకం కోసం కేటాయించి రైతులు చెల్లించాల్సిన ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని నిర్ణయించడంతో రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తుందడానికి ఇదే నిదర్శనమన్నారు. పంటలకు బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నందుకు రైతాంగం పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ కి ధన్యవాదాలు తెలుపుతున్నమన్నారు.

బీడీ కార్మికులు సంబరాలు నిర్వహించాలి

- బీఎల్‌టీయూ

నవతెలంగాణ-కామారెడ్డి

బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికులకు, ప్యాకర్లకు, బట్టి, చటన్ తదితర కార్మికులకు వేతనాలు (కూలీలు) పెరిగిన సందర్భంగా రెండు రోజులు బీడీ సెంటర్ల వద్ద సంబరాలు జరపాలని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, (బిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు సిరిగాద సిద్ధిరాములు బీడీ కార్మికులకు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సోమవారం, మంగళవారం రెండు రోజులు బీడీ సెంటర్ల ముందు ఆనందోత్సాహాలతో సంబరాలు నిర్వహించాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లో బీడీ యాజమాన్యంతో బీడీ కార్మిక సంఘాల నిర్వహించిన వేతన సవరణ చర్చలు సఫలమయినట్టు పేర్కొన్నారు. బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు రూ. 4-25, బీడీ ప్యాకర్లకు రూ 3650, బట్టి, చాటన్ కార్మికులకు రూ.1700 పెంచినట్టు తెలిపారు. ఇది కార్మికుల విజయమని, కార్మిక సంఘాల విజయమని పేర్కొన్నారు. కావున సోమవారం, రోజు ఉదయం ఆయా కంపెనీ సెంటర్ ల ముందు టపాకాయలు కాల్చి, స్వీట్లు పంచుకొని కార్మికుల ఐక్యతను చాటుకోవాలని పిలుపునిచ్చారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు 31 చివరి తేదీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందడానికి ఈనెల 31 ఆఖరు తేదీ అని ప్రిన్సిపాల్ సాయిబాబా ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమైనాయని, ఎంపీసీ,బైపిసి,సిఇసి, ఎంఇసి ప్రతి గ్రూప్ లో 40 సీట్లు భర్తీ చేసినట్టు తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన అయిన విద్యార్థులు మెమో,ఆధార్ కార్డు, ఫోటోతో మీసేవ కేంద్రానికి వెళ్లి %షుష్.ంఎశీస-వశ్రీంఎష్ట్రశీశ్రీం.ఎశీఎ% వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈదురు గాలులకు నేలవాలిన చెట్టు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలో ఆదివారం మూడు గంటలకు ఈదురుగాలలో వర్షం కురవడంతో వేప చెట్టు కూలి పోయింది. కటికేచాంద్ ఇంటిపై వేప చెట్టు కూలడంతో పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో వేప చెట్టు కూల డంతో పెనుప్రమాదం తప్పింది. ఇంటి యజమానులు తాళం వేసుకొని బంధువుల ఇంటికి వెళ్లారు. వేప చెట్టు కూలి ఇల్లు పాక్షికంగా దెబ్బతినడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కూలిన చెట్టును తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. ఈదురు గాలులకు గ్రామంలోని కురుమ సాయవ్వ హోటల్ రేకులు ఎగిరి కిందపడ్డాయి.



కూలిన వేప చెట్టు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు కామారెడ్డి రైల్వే ఇన్స్‌పెక్టర్ తావునాయక్ తెలిపారు. కామారెడ్డి పరిది లో కే ఎం ఎం ఓ . 4/4-5. మనోహరాబాద్ రైల్వే స్టేషన్ నుండి గజ్వేల్ రైల్వే స్టేషన్ మధ్యలో రామాయపల్లి గ్రామం దగ్గరలో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి శవము అందాజ వయసు 55 సంవత్సరముల నుండి 60 సంవత్సరముల ఉంటుందని తెలిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తు పడితే కామారెడ్డి రైల్వే పోలీస్ లను సంప్రదించాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఆహారం దొరికింది



జొన్న గింజలను తింటున్న పావురాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
పావురాలు ఆహారం కోసం వెతుక్కుంటూ వెళ్లి జొన్నలు, గోధుమల సంచుల వద్దకు చేరాయి. గుంపులుగా పావురాలు చేరి ఆ సంచుల్లోని గింజలను తిన్నాయి. నిజామాబాద్ నగరంలోని కిసాన్ గంజ్‌లోని ఓ చలివేంద్రం వద్ద కనబడిన దృశ్యం ఇది.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
4
సోమవారం | మే 27, 2024 | www.navatelangana.com

చెరువులో చేపల మృత్యువాత


మృత్యువాత పడ్డ చేపలు

నవతెలంగాణ - బోధన్
సాలూర మండల కేంద్రంలోని కామక్క చెరువులో సరిపడా నీరులేక అధిక ఉష్ణోగ్రతల కారణంగా నీరు వేడెక్కడంతో చేపలకు సరిగా ఆక్సిజన్ లభించక చేపలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో మత్స్యకారులు వారి ఆదాయాన్ని కోల్పోతున్నారు. చెరువులో చేపలు మృత్యువాతపడుతుండడంతో చెరువు పరిసర ప్రాంతం దుర్గంధభరితంగా మారింది. చేపల వేటకు కొంగలు భారీ సంఖ్యలో వాలిపోవడంతో చెరువు తెల్లని వర్ణంలో కనబడుతుంది.

పల్లెప్రకృతివనం దగ్ధం


దగ్ధమైన పల్లెప్రకృతివనం

నవతెలంగాణ-బోధన్
గ్రామస్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి ప్రభుత్వం గ్రామాలలో ఏర్పాటుచేసిన పల్లెప్రకృతివనం నిరాదరణకు గురవుతున్నాయి. కనీసం వాటిని పట్టించుకునే నాథుడే లేరు. సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఏర్పాటుచేసిన పల్లెప్రకృతి వనం గతంలోనే పాలకులు అస్తవ్యస్తంగా ఏర్పాటుచేశారు. అది ఏర్పాటుచేసినప్పటి నుంచి అందులో ఎవరు కూడా సేదతీరిన సందర్భం లేదు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పల్లె ప్రకృతి వనంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెట్ల మొదళ్లు కాలిపోయాయి. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన పల్లె ప్రతివనం చెట్లు అగ్నికి అహుతి అయిన పట్టించుకునేవారు లేరు. కావున అధికారులు దీనిపై విచారణ జరిపి బాధ్యులపై తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బంజారా ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బంజారా ఉద్యోగులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్
మండలంలోని బంజారా ఉద్యోగులు సొంత జిల్లాలో కొంతమంది మరి కొంతమంది వేరే జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా వారంతా కలిసి భీంగల్ మున్సిపల్ పరిధిలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బంజర ఉద్యోగులు అందరూ ఇందులో పాల్గొన్నారు. అనంతరం కమ్మర్పల్లి ఏఎస్ఓ దేవదాస్‌ను, భీంగల్ ఐటిఐ కాలేజీలో రెగ్యులర్ అయిన తిరుపతి లెక్చరర్ కూడా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు గంగారం, జనరల్ సెక్రటరీ రాజు, తిరుపతి, దేవదాస్, మూడ్ రమేష్, గణపతి, గణేష్, భీంగల్ మున్సిపల్ పరిధిలో ఉన్న బంజారా ఉద్యోగులు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-ఆర్మూర్
మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ పాఠశాల 1998- 99 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు పెరికిట్‌లోగల జీఆర్ గార్డెన్స్‌లో 25 వసంతాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఆనాడు చదువు చెప్పిన గురువులను చక్రధర స్వామి, సురేందర్, విజయలక్ష్మి, పద్మావతి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేసి ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సమాజంలో గురువుల స్థానం గొప్పదని చదువు వల్ల ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని అన్నారు. కార్యక్రమానికి సభ అధ్యక్షత వహించిన చక్రధర్ స్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు గొప్ప గొప్ప స్థానాల్లో ఉన్నందుకు గర్విస్తున్నామన్నారు. కార్యక్రమంలో సురేందర్, రఘునాథ్ శర్మ, విజయలక్ష్మి, పద్మావతి, సుభాషిని, సత్తార్, విద్యార్థులు ఇటే డి మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, నరహరి, సృజన్, అశోక్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు


పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-ఏర్గట్ల
మండలకేంద్రానికి చెందిన 2001-2002లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అంతా ఒకేచోట చేరి ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు.తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ...విద్యార్థులు వివిధ ప్రదేశాల్లో, వృత్తి, ఉద్యోగాల్లో స్థిరపడి,ఉన్నత శిఖరాలను అధిరోహించడం ఆనందంగా ఉందని అన్నారు.అనంతరం విద్యార్థులు వారు చదవుకునే రోజుల్లో వారి అనుభవాలను తోటి విద్యార్థులతో, గురువులతో పంచుకున్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

- పత్తి, మిరప విత్తనాల్లో నకిలీలు అధికం
- భీంగల్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కాంపాటి మల్లయ్య

నవతెలంగాణ-ఏర్గట్ల
ఆమోదితం పొందిన విత్తనాల కంటే మార్కెట్‌లో నకిలీ విత్తనాలు ఈ రోజుల్లో అధికంగా చలామణి అవుతున్నాయి. నకిలీ విత్తనాలు కొన్న రైతులు మోసపోయామని తెలుసుకున్న తర్వాత నష్టపోతున్నారు. కాగా విత్తనాలు కొనుగోలు చేసేముందు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకుంటే నకిలీల బెడద నుంచి తప్పించుకోవచ్చని భీంగల్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కాంపాటి మల్లయ్య సూచించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో నవతెలంగాణకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..


నకిలీ విత్తనాలు ఎలా గుర్తించాలి?

విత్తనాల సంచిపై కంపెనీ దారు పేరు, సరైన ప్యాకింగ్, లేబులింగ్, అడ్రస్ లేకపోవడం, లాట్ నంబర్, క్యూ ఆర్ కోడ్, ప్యాకింగ్ డేట్, గడువు ముగిసే తేదీ లాంటివి ఉండకపోవడం వల్ల గుర్తించవచ్చు.

నకిలీ విత్తనాలు ఏఏ పంటల్లో ఎక్కువగా గుర్తించవచ్చు?

మిరప, పత్తి విత్తనాల్లో నకిలీ విత్తనాలను ఎక్కువగా గుర్తించవచ్చు.

విత్తన, పురుగు మందుల డీలర్లు ఎటువంటి నియమ, నిబంధనలు పాటించాలి?


మాట్లాడుతున్న ఏడీఏ మల్లయ్య

విత్తన, పురుగు మందుల డీలర్లు రైతుకు రశీదు ఇచ్చేటప్పుడు, రశీదుపై రైతు పేరు, తండ్రి పేరు, రైతు ఫోన్ నంబర్, ఏ కంపెనీ విత్తనం ఇచ్చాము. ఏ రకమైన విత్తనం ఇచ్చాము. లాట్ నంబర్, బ్యాచ్ నంబర్, గడువు తేదీ రాసి రైతుకు ఇవ్వవలసిన బాధ్యత ఉంటుంది.

విత్తనాలను కొనుగోలు చేసేటప్పుడు రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఏ కంపెనీ విత్తనం మంచిదో బేరీజు వేసుకున్న తర్వాత ఆలోచించి కొనుగోలు చేయాలి. విత్తనం యొక్క బస్తా లేదా ప్యాకెట్‌ను, డీలర్ ఇచ్చిన రాశీదును పంట కాలం అయిపోయే వరకు భద్రంగా ఉంచుకోవాలి. ఒక వేళ పంట నాణ్యతగా రాకుంటే, మొలకెత్తకుంటే, డీలర్ మీద రైతు కేసు వేస్తే కంపెనీ ద్వారా రైతుకు నష్టపరిహారం అందుతుంది. ఒక వేళ రైతు డీలర్ వద్ద కొనుగోలు చేసినట్టుగా రశీదు, సంచి లేదా ప్యాకెట్ లేకుంటే రైతుకు ఎలాంటి నష్టపరిహారం అందదు.

నాణ్యమైన విత్తనాన్ని రైతు ఎలా గుర్తించవచ్చు?

రైతులు డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే, 100 విత్తనాలను(గింజలను) ఒక తెల్లని బట్ట ముక్కలో గానీ మట్టితో నింపిన డిస్పోజల్ గ్లాస్‌లో గానీ 24 గంటలు పెట్టి నీళ్ళు పడితే 100 గింజల్లో 80 గింజలు మెలకెత్తితే అవి నాణ్యమైన విత్తనాలుగా గుర్తించాలి. అప్పుడు పొలంలో గానీ తోటలో గానీ విత్తడం, అలుక్కోవడం చేయవచ్చు.

నకిలీ విత్తనాల వల్ల రైతు నష్టపోతే ఎలా?

నకిలీ విత్తనాల వల్ల రైతు నష్టపోయాడని అనుకుంటే... వ్యవసాయాధికారి పోలీసుల సహాయంతో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి డీలర్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసి, క్రిమినల్ కేసు చేసి డీలర్ లైసెన్స్‌ను రద్దు చేయడం జరుగుతుంది. ఆ తర్వాత రైతుకు కంపెనీ ద్వారా నష్టపరిహారం అందిస్తారు.

రైతులు దళారులను, ఏజెంట్లను, బంధువులను నమ్మి విత్తనాలు కొనుగోలు చేయవద్దని, లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, వ్యవసాయాధికారి సలహాలు,సూచనలు పాటించాలని భీంగల్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కంపాటి మల్లయ్య కోరారు. డీలర్ వద్ద రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు మొత్తం ఆన్లైన్ అవుతుందని, దీని వల్ల డీలర్ తప్పించుకునే వీలు ఉండదని రైతులకు తెలిపారు.

కల్తీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవు

- మండల వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి


రెంజల్: పెస్టిసైడ్‌స దుకాణం తనిఖీ చేస్తున్న ఏవో


నందిపేట్‌లో...

నవతెలంగాణ-రెంజల్
రైతులు రాబోవు ఖరీఫ్ సీజన్లో అవసరమైన విత్తనాలు కొనుగోలు విషయంలో తగు జాగ్రత్తలను పాటించాలని రెంజల్ వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మండలంలోని పెస్టిసైడ్స్ దుకాణాలను తనతో పాటు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు లైసెన్స్ కలిగిన వాటిని సందర్శించి రికార్డులను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ కల్తీ విత్తనాల విక్రయాలపై ప్రత్యేక దృష్టి సాధించిందని ఆయన పేర్కొన్నారు. లూజుగానున్న బస్తాలను తీసుకోరాదని, రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా రసీదును తీసుకోవాలని ఆయన సూచించారు. పంట కాలం పూర్తయ్యే వరకు రైతులు తీసుకున్న రసీదులను జాగ్రత్తగా ఉంచుకోవాలని ఆయన అన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలను కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. సెల్స్ రిజిస్టర్లలో విక్రయించిన ప్రతి ధాన్యం బస్తా వివరాలను పొందుపరచాలని డీలర్లకు ఆదేశించారు. దుకాణాల్లో ధాన్యం బస్తా నిలువలు, వాటికి సంబంధించిన ధరల పట్టికను తప్పనిసరిగా దుకాణదారులు పాటించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డితో పాటు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అజయ్, కవిత, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట్ : మండల కేంద్రంలో పలు విత్తన దుకాణాలను మండల వ్యవసాయాధికారి జోస్న భవాని తనిఖీ చేశారు. దుకాణదారులు తప్పనిసరిగా బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్, ఇతర రికార్డులను తప్పనిసరి పాటించాలన్నారు. రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఖరీఫ్‌లో నాణ్యమైన విత్తనాలు అందించాలని దుకాణ యజమానులకు ఆమె సూచించారు.

లైబ్రరీ అభివృద్ధి కమిటీ ఎన్నిక


ఎన్నికైన లైబ్రరీ కమిటీ

నవతెలంగాణ-బోధన్
సాలురా గ్రామంలోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం (లైబ్రరీ) అభివృద్ధి కమిటీని ఆదివారం శాశ్వత సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకఉన్నారు. నూతన లైబ్రరీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా మల్లెపూల స్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా లింబూరి లక్ష్మణ్ (తేజ), ఉపాధ్యక్షులుగా కర్దం అశోక్ బాబా, ఇల్లెపు రమేష్, శివకాంత్ పటేల్, సంయుక్త కార్యదర్శి వడ్ల దత్తురాం, నజీర్, ముఖ్య సలహాదారులుగా ఇల్లెపు శంకర్ సార్, ప్రజ్ఞశ్రీ రాజు సార్, సింగడి పాండు, బొర్ర గంగారం, అల్లే రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులకు శాశ్వత సభ్యులు అఅభినందించారు. ఈ సంధర్భంగ ఆయన మాట్లాడుతూ లైబ్రరీ అభివృద్ధికి, పాఠకుల సౌకర్యార్థం కావలసిన సౌకర్యాల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని అధ్యక్షులు స్వామిగౌడ్ తెలిపారు.

రోడ్డు వేశారు.. డ్రైనేజీ మరిచారు

- ఎక్కడిక్కడ నిలుస్తున్న మురికి నీరు
- దుర్గంధం వెదజల్లుతున్న వైనం
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు అధికారులు


డ్రైనేజీ లేక నిలిచిన మురుగునీరు

నవతెలంగాణ-మాక్లూర్
మండలంలోని అమ్రాద్ గ్రామంలోని నూతనంగా ఏర్పడిన కాలనీలో సీసీ రోడ్డులో వేశారు.. కానీ పక్కనే డ్రైనేజీ వేయడం మరిచారు. నూతనంగా నిర్మించిన ఇండ్ల నుంచి వచ్చిన నీటితో కుంటలా ఏర్పడి కాలనీ దుర్గంధంగా మారింది. స్థానిక ప్రజలు డ్రైనేజీని ఏర్పాటు చేయాలని అధికారులను, ప్రజా ప్రతి నిధులను వేడుకున్న పట్టించుకోలేదని అంటున్నారు. మురికి కాలువ వల్ల ఇప్పటికే దోమలు చేరాయాన్నారు. వచ్చేది వర్ష కాలం వర్షాల వల్ల నీరు నిలువ చేరి మరింత దుర్గంధం వదజల్లుతుందని వాపోతున్నారు. వెంటనే అధికారులు, ప్రజా ప్రతి నిధులు డ్రైనేజీనీ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-మోర్తాడ్
మండల కేంద్రంలోని ఆర్ జి జి ఫంక్షన్ హాల్ లో ఆదివారం 25 సంవత్సరాల సందర్భంగా సిల్వర్ జూబ్లీని పూర్వ విద్యార్థులు నిర్వహించుకున్నారు. 98-99 సంవత్సరం సంబంధిత పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. పాఠశాలలో జరిగిన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉపాధ్యాయులను గుర్తుచేసుకున్నారు. వారి విద్యాబోధనతోనే నేడు ఉన్నత స్థాయికి ఎదిగామని గురువులను కొనియాడారు. ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులందరూ కలవడం తమకెంతో సంతోషంగా ఉందని విద్యార్థులను తాము మర్చిపోయిన తమను మాత్రం మర్చిపోకుండా ఆహ్వానించడం తమకు ఎంతో గర్వకారణమని ఉపాధ్యాయులు అన్నారు.

ఓం పద్మశాలి సంఘం మొదటి తర్ప కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రంలోని ఓం పద్మశాలి సంఘం మొదటి తర్ప నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం సంఘ భవనంలో నిర్వహించిన సంఘ సర్వసభ్య సమావేశంలో కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఓం పద్మశాలి సంఘం మొదటి తర్ప నూతన అధ్యక్షునిగా చింత గణేష్, ఉపాధ్యక్షుడిగా చింత సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా చిలువేరి పవన్, కోశాధికారిగా చింత ప్రవీణ్, దైవశెట్టిగా వంగ నరహరి, సలహాదారులుగా చిలివేరి లక్ష్మణ్, చింత బలరాం, అన్నం గణపతి రామ్, అంగరి రాజేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా రేగుంట శంకర్, రేగుంట అశోక్, వంగ నవీన్, చింత నందకుమార్, చింత ప్రసాద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సంఘ కార్యవర్గ సభ్యులను సంఘ సభ్యులు అభినందించారు.

గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షునికి సన్మానం

కమ్మర్ పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన బోగ రామస్వామిని స్థానిక ఓం పద్మశాలి సంఘం మొదటి తర్ప సభ్యులు ఘనంగా సన్మానించారు. సంఘ సభ్యుడు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం సంఘ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ సభ్యుల సమక్షంలో శాలువాతో సత్కరించి అభినందించారు.

మేరు కుల విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేత



విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్
ఇటీవల వెలువడిన పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితా లలో మెరిట్ సాధించిన మేరుకుల విద్యార్థులకు ప్రతిభ పరిష్కారాల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ లావణ్య శ్రీనివాస్ హాజరై విద్యార్థులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షులు రవినాథ్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి గంగాధర్ మీ వా అధ్యక్షులు దీకొండ కిషన్ ప్రధాన కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి బీడీలకు రూ.300 ఇవ్వాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
వెయ్యి బీడీలకు రూ.300 ఇవ్వాలని బీడీ కార్మికులు లేబర్ రైట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రావల్లి శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికులకు వేతనం పెంపు కోసం ఈనెల 25 న హైదరాబాదులో బీడీ యాజమాన్యాలకు కార్మిక సంఘాల నాయకులకు జరిగిన చర్చలు జరిపారని తెలిపారు. నిత్యావసర ధరలు పెరుగుతున్న తరుణంలో 1000 బీడీలు తయారీకి కేవలం 4 రూపాయల 25 పైసలు పెంచడం సరికాదని అన్నారు. రెక్కల కష్టంతో 1000 బీడీలు చేసిన బీడీ కార్మికుల శ్రమ ద్వారా జీఎస్టీ 28 శాతం ప్రభుత్వానికి పన్నుల రూపేనా పోవడం ద్వారా శ్రమ దోపిడీకి గురవుతున్న బీడీ కార్మికులను ప్రభుత్వాలు ఆదుకోవడం లేదని తెలిపారు. నెల మొత్తంలో 1000 బీడీలు శ్రమదోపిడికి గురవుతున్నారని అన్నారు. 1000 బీడీల తయారీకి 300 రూపాయల కూలి, నెలసరి ఉద్యోగులకు 18 వేల రూపాయల జీతం, ప్యాకర్లకు వెయ్యి బీడీలు చుట్టిన దానిపై 25 రూపాయల కూలి ఇచ్చే విధంగా కార్మికులంతా ఒక్కటి కావాల్సిన అవసరం ఏంతైనా ఉంది అని తెలిపారు.

మధురస్మృతుల సమ్మేళనం




నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2008-09 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకకు ఆనాడు తమతో కలిసి చదువుకున్న తోటి విద్యార్థులు, గురువులను ఆహ్వానించారు. ఈ వేడుకలో పూర్వ విద్యార్థులతో పాటు అధ్యాపకులు అందరూ హాజరై ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 15 సంవత్సరాల నాటి మధురస్మృతులను గుర్తు చేసుకుంటూ ఆడి పాడారు. స్కూల్ తరగతి గదుల్లో తిరుగుతూ చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులందరిని శాలువాలు పూలమాలతో ఘనంగా సన్మానించారు. గురువులతో కలిసి గ్రూప్ ఫోటోలు దిగి, సహపంక్తి భోజనాలు చేశారు కార్యక్రమంలో అధ్యాపకులు పురుషోత్తం శర్మ, సాయన్న, రవీందర్, గోపి, పవన్, శైలజ, లక్ష్మి, నరేష్, విద్యార్థులు అమీర్, తేజ, రాకేష్, నరేష్, కిషోర్, మనీష్, రాకేష్, సుకన్య పల్లవి, మనోజ, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

పైపుల లీకేజీలకు మరమ్మతులు చేపట్టండి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగల్ పహాడ్ గ్రామంలో గల ప్రధాన రహదారి పక్కన మంచినీటి ట్యాంక్ ద్వారా సరఫరా అవుతున్న లీకేజీలను అరికట్టాలని గ్రామస్తులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఉదయం నుండి పైపు ద్వారా నీరు వృధాగా పోతుందని, రహదారి వెంట రాకపోకలు సాగించే ప్రజలకు కొంతమేరకు ఇబ్బంది కలుగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాదచారులు కూడా లీకేజ్ అవుతున్న నీటిలో నుండి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. సంబంధిత అధికారులు, సిబ్బంది లీకేజ్ అవుతున్న పైపులను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



లీకవుతున్న నీరు

5

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

సోమవారం | మే 27, 2024 | www.navatelangana.com

గాలివాన బీభత్సం

నవతెలంగాణ-కోటగిరి

మండలంలో ఆదివారం మధ్యాహ్నం వర్షంతో కూడుకున్న ఈదురు గాలులతో వృక్షాలు నేలకొరిగాయి, ఇండ్లపైన ఉన్న ఇనుప రేకులు లేచిపోయాయి. అరగంటలో వాన బీభత్సం సృష్టించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొ న్నారు.



విద్యాసంస్థల ప్రచారాల హోరు

- ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లతో ప్రచారం
- సోషల్ మీడియాలోనూ అదే జోరు
- ఉపాధ్యాయులూ అడ్మిషన్ చేయించాల్సిందే
- అడ్మిషన్లే లక్ష్యం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రైవేటు విద్యాసంస్థల ప్రచారాల హెూరు... జోరు.... ఊపందుకుంది, ఇక్కడ... అక్కడ... ఎక్కడ... అనే స్థలాన్ని వదిలివేయకుండా, ఏ విధంగా అయితే అనుకూలంగా ఉంటుందో, ఆ విధంగా ప్రతి ఒక్క చోట, ప్రతి ఒక్క స్థలాన్ని ప్రచార అస్త్రాలుగా మార్చుకునే పనిలోనే విద్యాసంస్థలు మునిగితేలుతున్నాయి. నగరంలోని ప్రతి మూల మలుపు వద్ద, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలలో ప్రతి చౌరస్తా వద్ద, నూతనంగా ఏర్పడిన విద్యాసంస్థల నుండి, గత 20, 30 సంవత్సరాల పాటు అనుభవం ఉన్న విద్య సంస్థలు సైతం ఫ్లెక్సీలు, హెూర్డింగులు, ప్రతి విద్యుత్ స్తంభానికి, టెలిఫోన్ పోల్‌కి విద్యాసంస్థల ప్రచారాలను ఏర్పాటు చేశారు. ప్రతి విద్యా సంస్థలో పనిచేసే అటెండర్ నుండి ప్రిన్సిపల్ వరకు అందరూ వారు ఉపయోగించే వాట్సాప్, ఫేస్బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఇలా అన్ని రకాల సోషల్ మీడియాను ప్రచార అస్త్రాలుగా వాడుకుంటున్నారు. విద్యాసంస్థల ప్రచారాలు వాల్ పోస్టర్లు సైతం ప్రచురించి ఏ ఒక్క విధమైన ప్రచారాన్ని కూడా వదులుకోకుండా అడ్మిషన్ లే లక్ష్యంగా వ్యవహరిస్తూ కొనసాగిస్తున్నారు. ప్రచారం మాత్రం జోరుగా.. హెూరుగా కొనసాగుతోంది. 'ప్రచారంలో ఉన్న శ్రద్ధ విద్యార్థులపైన, విద్యను బోధించడంలో ఉండి ఉంటే, అడ్మిషన్లు వాటికవే విద్యాసంస్థకు వచ్చి చేరుతాయి అనే అంశాన్ని మరిచిపోతు న్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, జిల్లా ప్రజలు అంటున్నారు. ఏ ఒక్క అంశాన్ని అయిన ప్రచారంగానే వాడు కుంటూ విద్యాసంస్థలు ముందుకు వెళుతున్నాయి.

ప్రతి ఒక్కరికి టార్గెట్..

ప్రతి విద్యా సంస్థలలో అక్కడ బోధించే ఉపాధ్యాయులు సైతం ప్రతి ఒక్కరికి 3, 4 అడ్మిషన్లు కచ్చితంగా చేయాలని నిబంధనలను కూడా ఏర్పాటు చేసి, మీరు ఈ అడ్మిషన్లు తీసుకువస్తేనే, మీరు సక్రమంగా విద్యను బోధిస్తున్నారని, విద్యను అందించగలుగుతున్నారని, లేకపోతే మీరు మా దగ్గర పని చేయవద్దు, మేము అడ్మిషన్లు చేసే ఉపాధ్యాయులనే పెట్టుకుంటున్నాము అనే విధంగా, విద్యాసంస్థలు ప్రైవేట్ కార్పొరేట్ అని తేడా లేకుండా అందరూ అదే పద్ధతిని అనుసరిస్తున్నారు. ప్రతి ఒక్క



ప్రచారం కోసం ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

ఉపాధ్యాయుడు ఏ సబ్జెక్టు బోధించిన సరే, ఆ ఉపాధ్యాయులకు, అధ్యాపకునకు కచ్చితంగా టార్గెట్ పూర్తి చేయవలసిందే, లేకుంటే మరోచోట ఉద్యోగాన్ని వెతుక్కోండి అనే విధంగా విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రవర్తి స్తున్నాయి.

ఉపాధ్యాయులా..... మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్వా....

వీరు ఉపాధ్యాయులా... మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్వా... అనే విధంగా ప్రవర్తించడం దారుణంగా ఉంది. ఒక ఉపాధ్యాయుడు తరగతిలో ఉన్న పిల్లలందరినీ, వారి తల్లిదండ్రులని విద్యాసంస్థ ప్రారంభమైనప్పటి నుండి ఆకాడమి పూర్తి అయ్యేంతవరకు, ప్రతి క్షణం విద్యార్థుల తల్లిదండ్రులే టార్గెట్‌గా విద్యార్థుల తల్లిదండ్రులను కూడా మార్కెటింగ్ చేయించే విధంగా, వారి ద్వారా కూడా అడ్మిషన్ పొందేందుకు, ఉపాధ్యాయ అధ్యాపకులు వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు ఏ మేరకు విద్యను అభ్యసిస్తున్నారు, వారికి ఏ యే పాఠ్యాంశాలు అర్థం కావడం లేదు, వేటిపైన ఆసక్తి చూపుతున్నారా.. అనే అంశాలను చేర్చకుండానే, వారికి అవసరమైన విషయాలను పూర్తిగా అవగాహన పరుచకుండానే, విద్యాసంస్థల ప్రారంభం నుండి అకాడమి ముగిసేవరకు వారి లక్ష్యం అడ్మిషన్ లే.

విద్యార్థుల తల్లిదండ్రులకు టార్గెట్....

సార్..., మేడమ్... మీ బాబు పాప ఏ విధంగా చదువుతున్నాడు అనే సాకును పెట్టుకుని, పలకరిస్తూనే.... మీకు తెలిసిన వారు ఏవారైనా ఉంటే, అడ్మిషన్ చేసుకోవాలనుకునే వారు ఎవరు ఉన్న నాకు తెలియజేయండి సార్.... మేడం..., మీ పరిసరాల్లో ఉన్న వారికి మా పాఠశాలలో మంచి విద్య బోధనలను అందిస్తున్నం అనే విషయన్ని తెలియజేయండి సార్... మేడం... అంటూ అడగడం విద్య సంస్థలో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపకులకే చెల్లుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

విద్యార్థుల ద్వారా

కొన్ని సందర్భాలలో విద్యార్థులు కూడా మార్కెటింగ్ చేసి అడ్మిషన్లు సాధించే విధంగా కూడా విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయి. అది ఎలా అంటారా.. విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు మీ బయోడేటాను రాసి ఇవ్వండి అనే విధంగా ఒక ప్రొఫార్మ తయారుచేసి, దానితోపాటు మీ ఇంటి చుట్టుముట్టుగా ఉన్న తోటి పిల్లలు, ఏ పాఠశాలలో చదువుకుంటున్నారు?, ఏ తరగతిలో చదువుతున్నారు...?, ఆ విద్యార్థి పేరు ఏమిటి....?, వారి తండ్రి పేరేమిటి..., తల్లి పేరేమిటి..., వారి ఫోన్ నెంబర్ ఏంటి..., అనే సమాచారాన్ని కూడా విద్యార్థుల దగ్గర నుండి తెప్పించుకుంటున్నారు. అంటే విద్యార్థులు కూడా మార్కెటింగ్ చేయడంలో ఒక పాత్ర పోషించడానికి ఉపయోగపెడుతున్నారు అనేది కూడా వాస్తవమే. ఈ విషయాన్ని ఏ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు వదలడం లేదు. వారి లక్ష్యం అడ్మిషన్ లే.

ఇక పీఆర్ఓ...

ప్రతి విద్యాసంస్థకు కచ్చితంగా మార్కెటింగ్ చేయుటకు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ వారే పీఆర్వోలు, వీరు మరీ ప్రత్యేకం.... వీరికి మరో రకమైన ప్రత్యేకత ఉంది. వీరు విద్యాసంస లలో ఉన్న లేకున్నా అన్ని డాంబాలు పలుకుతూ... మా విద్యాసంస్థలకు మంచి మార్కులు..., మంచి ర్యాంకులు..., మా విద్యాసంస్థలో... ఆటలు, పాటలు, అసలు మా విద్యాసంస్థలో నేర్పనివి అంటు ఏమియూ లేవు అని, మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ అంటూ ఇలా రకరకాల మాటలు చెప్పి అడ్మిషన్ చేయించడం వీరి ప్రత్యేక వత్తి. వీరు అడ్మిషన్ చేసిన వారికి చేసినట్టుగా, వేతనంతో పాటు ప్రతి అడ్మిషన్ పైన కమిషన్, ఇది విద్యాసంస్థలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వారి యొక్క ఆయుధం. ఈ ఆయుధంతో కూడా ప్రతి తరగతిలో విద్యాసంస్థలు అడ్మిషన్ లక్ష్యంగా పనిచేయడం జరుగుతుంది. ఈ విధంగా కూడా అడ్మిషన్‌లే టార్గెట్.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

నవతెలంగాణ-మెండోర

వర్ని మండలం జలాల్ పూర్ గ్రామానికి చెందిన పడమటి సందీప్ రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలానికి చెందిన పడమటి సాయిలుకు ఇద్దరు కుమారులు. పెద్దకొడుకు సందీప్ ఆదివారం పార్సిల్స్ డెలివరీ ఇవ్వడానికి నిజామాబాద్ నుండి ఇచ్చోడకు కంపెనీ వెహికిల్ లో వెళ్తున్నాడు. మెండోర పరిధిలోని దూదిగం గ్రామ శివారులో జాతీయ రహదారి పై ఓ వాహనం ఓవర్ టెక్ చేస్తున్న క్రమంలో ఎటువంటి సూచికలు లేకుండా రోడ్డుపై నిలిపి ఉన్న లారీని ఢీకొనగా బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ను నిర్మల్ ప్రభుత్వ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని ప్రయివేటు హాస్పిటల్ తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. జాతీయ రహదరిపై ఎటువంటి సూచికలు పెట్టకుండా వెహికల్‌ని నిలిపి తన కొడుకు మరణానికి కారణం అయిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని మృతుని తండ్రి స్థానిక పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మెండోర పోలీసులు తెలిపారు.



మృతదేహాన్నితరలిస్తున్న పోలీసులు

కురుమ విద్యార్థులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాల ప్రదానం



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన కురుమలు ఉన్నత చదువులు చదివి ఉన్నతస్థానాలకు ఎదగాలని కురుమ యువ చైతన్య సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురుమ సాయిబాబా అన్నారు.ఆదివారం స్థానిక వశిష్ట డిగ్రీ కళాశాలలో 10వ తరగతి/ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 60 మంది కురుమ విద్యార్థులకు కురుమ చైతన్య సమితి ఆధ్వర్యంలో జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేయడంతో పాటు సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గొరిగే నర్సింహ, జిల్లా అధ్యక్షులు మామిడి సంజీవ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రోళ్ల స్వామి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దోళ్ల మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి నాలుగో వార్షికోత్సవం



బోనాలతో వెళ్తున్న ముదిరాజ్ కులస్తులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల గ్రామంలో ఆదివారం పెద్దమ్మ తల్లి నాలుగో వార్షికోత్సవ వేడుకలను గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో మహిళలు బోనాలు తీసుకొని అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రధాన వీధుల గుండా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. అమ్మవారి చల్లటి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని వారు మొక్కుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు గంగాధర్, భూమన్న, మండల ఉపాధ్యక్షులు ఖ్యాతం యోగేష్, అనిల్, రమేష్, సాయి, శివకుమార్, రాజు, రాము, గంగా కిషన్, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీకై ఒకరికి తీవ్ర గాయాలు

- ఆసుపత్రికి తరలింపు
- తప్పిన పెను ప్రమాదం



సిలిండర్ పేలిన ప్రదేశం

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రంలో వంట గ్యాస్ సిలెండర్ నుండి చిన్న గ్యాస్ బుడ్డిల్లో గ్యాస్ బదిలీ చేసే క్రమంలో గ్యాస్ లీకై ఆదివారం సాయంత్రం 7:30 సమయంలో నిర్వాహకుడు మిట్టపల్లి ప్రకాష్ అనే వెక్తికి తీవ్ర గాయలయ్యాయి. కుటుంబసభ్యులు క్షతగాత్రున్ని హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వైద్యుల సలహా మేరకు జిల్లాకేంద్ర ఆసుపత్రికి తరలించారు. బాధితుడు నివాస గృహంలోనే అక్రమంగా, ఇంటికి వాడే 14 కిలోల గ్యాస్ సిలెండర్లను తెచ్చి వాటిని చిన్న, చిన్న, బుడ్డిల్లోనే కాకుండా, గ్యాస్ తో నడిచే కార్లకు గ్యాస్ నింపుతూ వ్యాపారం చేస్తున్నాడని స్థానికులు అంటున్నారు. 10,15 సంవత్సరాలనుండి స్థానికులు పలు మార్లు చెప్పిన వినకుండా అక్రమ వ్యాపారం చేస్తున్నాడని చర్చించుకుంటున్నారు. బాధితునికి సిగరెట్ తాగే అలవాటు ఉండటంతో ఈప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. పక్కనే సుమారు 10 సిలిండర్లు ఉన్నాయని, ఇంట్లో కుటుంబ సభ్యులు ఉన్నారని, ఆ సిలెండర్ల నిప్పు అంటుకొని ఉంటే పెద్ద ప్రమాదమే సంభవించేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇలాంటి వ్యాపారస్థులు మరి కొందరు ఉన్నారని అధికారులు స్పందించి నివాసగృహల్లో రీఫిలింగ్ చేయకుండా అరికట్టాలని, అలాంటి వారిపై కేసులు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఘటనపై ఎస్ఐ విక్రమ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, కేసు నమోదు కాలేదని తెలిపారు.

బీడీ కార్మికుల వేతన ఒప్పందం చర్చలు సఫలం

నవతెలంగాణ-ఆర్మూర్

బీడీ కార్మికులకు వేతన ఒప్పందం చర్చలు సఫలమయ్యాని, పెరిగిన వేతనాలను మే ఒకటి నుండి అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) నాయకులు అన్నారు. ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బి.భూమన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.సూర్య శివాజీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీలు చుట్టే కార్మికులు , బీడీ ప్యాకర్లు, బట్టీవాలా, చెన్నివాలా, బీడీ చాటర్స్, ట్రై పిల్లర్, క్లర్క్స్ మొదలగు కేటగిరీలకు చెందిన కార్మికులకు గత వేతన ఒప్పందం తేది 30.04.2024తో ముగిసిందని తెలిపారు. బీడీ కార్మిక సంఘాలకు బీడీ యాజమాన్య సంఘంతో హైదరాబాద్ కొంపల్లి లోని మినర్వా గ్రాండ్ హెూటల్ లో చర్చలు జరిగాయని అన్నారు. ఈ చర్చల్లో బీడీ ప్యాకర్లకు నెలకు 3650, నెలసరి ఉద్యోగస్తులకు 1700 చొప్పున వేతనాల పెరిగాయని, వెయ్యి బీడీలకు (4-25పైసల) చొప్పున కూలి రేట్ల పెంపుకు ఒప్పందం కుదిరిందని తెలిపారు. పెరిగిన వేతనాలు తేదీ 01-05-2024 నుండి 30-04-2026 అమలులో ఉంటాయి అని అన్నారు.

ఈ చర్చల్లో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చింత భూమేశ్వర్ , యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య శివాజీ, రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ హరిత, రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, రాష్ట్ర కోశాధికారి గంగాధర్, పాల్గొన్నారని తెలిపారు. ఈ వేతనాలు రాష్ట్రంలోని ఏడులక్షల మంది బీడీ కార్మికులకు వరిస్తాని తెలిపారు బీడీ కార్మికుల ఐక్యత వల్లనే కూలీరేట్లు పెరిగాయని, బీడీ కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలని కోరారు. బీడీ యాజమాన్యాలు పెరిగిన వేతనాలను మే 1వ తేదీ నుంచి అమలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే పి గంగాధర్ సహాయ కార్యదర్శి ఎం సుప్రియ ఎస్ వెంకటేష్ తదితరులులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏకరూప దుస్తుల తయారీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏకరూప దుస్తులను కుట్టించి ఇవ్వడం జరుగుతుందని ఏపిఎం రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం ప్రభుత్వం ఏకరూప దుస్తులను మహిళా సంఘాల ద్వారా కుట్టించి మహిళా సంఘ సభ్యులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి మండలానికి ప్రభుత్వం ద్వారా ఏకరూప దుస్తులు కుట్టడానికి క్లాత్‌ను పంపించిందని చెప్పారు. ఆదివారం మండల సమైక్య కార్యాలయంలో ప్రభుత్వం ద్వారా వచ్చిన బట్టలు కొలతల ప్రకారం మహిళా సంఘాల సభ్యులు కటింగ్ చేసి బట్టలు కుట్టే ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



మండల సమైక్యలో ఎక్స్టర్నల్ ఆడిట్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మండల సమైక్యాలొ ఎక్స్టర్నల్ ఆడిట్ నిర్వహించినట్టు ఏపీఎం రవీందర్ రెడ్డి తెలిపారు. మండల సమైక్యాలోని 31 గ్రామ సంఘాల ఎక్స్టర్నల్ ఆడిట్ ను శనివారము ఆదివారము రెండు రోజులు నిర్వహించడం జరిగిందన్నారు. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు ఆర్థిక లావాదేవీలను, ఆదాయవ్యయాలు, బ్యాలెన్స్ ఇట్స్ వేసి ఆడిట్ ని పూర్తి చేయడం జరిగిందని ఏపిఎం తెలిపారు.

పెట్రోలు పోసుకొని ఒకరు ఆత్మహత్య

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మిర్ధాపల్లి గ్రామానికి చెందిన కర్రోళ్ల పోశెట్టి (40) పెట్రోలు పోసుకొని నిప్పంటించుకుని చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కొన్ని నెలలుగా తాగుడికి బానిసై ఎవరు డబ్బులు ఇవ్వకపోవడంతో పోశెట్టి పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. భార్య కర్రోల్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ పరిధిలోని పెర్కి శివారులో మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన ఎల్ చందు (30) జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. మోర్తాడ్ నుంచి ఆర్మూర్ వైపునకు బైకుపై వెళ్తున్న ఆయన పెర్కిట్ శివారులో బైక్ పై నుంచి పడి తలకు, ఇతర భాగాలకు గాయాలు కావడంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఆర్మూర్

పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన నర్ర రాజేందర్ (50) కొంతకాలంగా తాగుడికి బానిస అయ్యాడు. దీంతో ఆదివారం తన ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. భార్య నర్ర గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గాంధారిలో ఘనంగా బోనాల పండుగ

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిరవహించారు. గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కుల సంఘాల ప్రతినిధులు మహిళలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి జీలుగ విత్తనాల పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్ పల్లి

సోమవారం నుంచి చిలుక విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్టు అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని అర్గుల్ సింగిల్ విండో పరిధిలోని గ్రామాల వారికి సోమవారం నుంచి జీలుగా విత్తనాల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. 60 శాతం సబ్సిడీ పైన ఒక బ్యాంకు 1116 రూపాయలు చెల్లించాలన్నారు. రెండెకరాల 20 గుంటలకు ఒక బ్యాగు ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్గుల్ సింగిల్ విండో పరిధిలోని గ్రామాల రైతులు జీలుగ విత్తనాలను వినియోగించుకోవాలని కోరారు.

రుద్రూర్‌లో ఈదురు గాలులకు నేలకూలిన చెట్లు

ఎగిరిపోయిన ఇండ్లపైగల రేకులు

నవతెలంగాణ-వర్ని (రుద్రూర్)

మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలికి పలు కాలనీల్లో చెట్లు విరిగి పడ్డాయి. ఇండ్ల పై ఉన్న రేకులు ఎగిరిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెట్లు వీధిలో సిసి రోడ్ల కు అడ్డంగా పడటంతో కాలనీ వాసూలు భయందోళకు గురయ్యారు.. ఆదివారం కావటంతో పంచాయతీ సిబ్బంది కి సెలవు ఉండటంతో ప్రజలే చెట్లను తొలగించుకొన్నారు. ప్రాణప్రాయం జరుగకపోవటం తో ప్రజలు ఊపిరి తీసుకొన్నారు.



నేలికూలిన చెట్టు, ఎగిరిపడిన ఇండ్ల రేకులు